www.vishvambhara.com

తెలుగు దినపత్రిక

# ప్రజా విశ్వంభర

అక్షరం సాక్షిగా...

శుక్రవారం 8 - 8 - 2025 సంపుటి : 1 సంచిక : 33 పేజీలు : 12 వెల : 5/- తెలంగాణ/ఆంధ్రప్రదేశ్




డా॥ కాచం సత్యనారాయణ
CMD



మెడికల్ కాలేజీలో

## గంజాయి కలకలం..

సరాఫరా చేస్తున్న ఇద్దరి అరెస్టు...

9 మంది విద్యార్థులకు డ్రగ్స్ పాజిటివ్.. వీరిలో ఇద్దరు అమ్మాయిలు..

2లో...

# తేల్చుకుందామనే దేశ రాజధానికి వచ్చాం

### 42 శాతం బీసీ రిజర్వేషన్లు సాధించాలని డిల్లీకి వచ్చాం

### మూడు రోజులుగా ప్రయత్నాలు చేస్తున్నాం

- కేంద్రం నుంచి ఏమాత్రం సహకారం అందడం లేదు
- భారత రాష్ట్ర సమితి బీసీలకు నైతిక మద్దతు కూడా ఇవ్వడం లేదు
- ఈ ధర్నాకు 100 మంది ఎంపీలు మద్దతు ఇచ్చారు
- రాష్ట్రపతి అపాయింట్‌మెంట్ రాకుండా మోడీ, అమిత్‌షా అడ్డుకున్నారు
- ముస్లిం రిజర్వేషన్ల సాకుతో ఓబీసీ రిజర్వేషన్లను అడ్డుకునేందుకు బీజేపీ చూస్తోంది
- కాంగ్రెస్‌ను దెబ్బతీయాలని బీజేపీతో బీఆర్ఎస్ అంటకాగుతోంది
- ఈరెండు పార్టీలను బీసీ ద్రోహులుగా తెలంగాణ సమాజం భావిస్తోంది
- ఏ సమస్యను దీర్ఘకాలం వాయిదా వేసినా అది మిమ్మల్నే బలితీసుకుంటుంది
- బిల్లులు, ఆర్డినెన్సును రాష్ట్రపతి ఆమోదించకుంటే పీఏసీలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ...

2లో...





హైదరాబాద్‌లో

## భారీ వర్షం..

ట్రాఫిక్ చక్రబంధంలో సైబర్ సిటీ రోడ్లపైకి వరదనీరు చేరడంతో వాహనదారులు అవస్థలు భారీ వర్షంతో జనజీవనం అస్తవ్యస్థం..

2లో...



2లో...

రైతుల ప్రయోజనాలపై

## రాజీపడే ప్రసక్తే లేదు..

వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా భారత్ సిద్ధమే

రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం

ట్రంప్ టారిఫ్‌ల వేళ గట్టిగా బదులిచ్చిన మోడీ

మతపరమైన రిజర్వేషన్లకు

## బీజేపీ వ్యతిరేకం

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించుకోవాలి
- బీసీలకే 42 శాతం ప్రకటిస్తే అమలు చేసే బాధ్యత నాది
- మత పరమైన సమస్యలు తీసుకొచ్చి దేశంలో అశాంతికి కాంగ్రెస్ కుట్రలు
- రాష్ట్రపతిపై తెలంగాణ మహిళా మంత్రి వ్యాఖ్యలు అభ్యంతరకరం - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

2లో...



## త్వరలో భారత పర్యటనకు పుతిన్..!

పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నాం

వెల్లడించిన అజిత్ దోవాల్ - పుతిన్‌తో దోభాల్ భేటీ

2లో...



## పంద్రాగస్టు వేడుకలకు పటిష్ఠ భద్రత



10వేల మంది పోలీసులు మోహరింపు

- యాంటీ డ్రోన్ వ్యవస్థలు.. ముఖ గుర్తింపు సాంకేతికతలు
- ఆన్‌లైన్ బెదిరింపులను కట్టడి చేసేందుకు సోషల్ మీడియాపైనా దృష్టి...


2లో...

## ఓటర్ల జాబితాలో అవకతవకలు

మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదు

- ఓటర్ల జాబితా మాకు ఇచ్చేందుకు ఈసీ నిరాకరణ
- అది దేశ సంపద.. దానిని ఎందుకు చూపించట్లేదు..
- కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

2లో...




## అధికారంలోకి వస్తాం.. అందరి లెక్కలు సరిచేస్తాం

యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోంది

- స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుంది
- ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలు పెట్టి బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలి
- బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్..



2లో...

## హ్యామ్ రోడ్లకు వచ్చే వారం టెండర్లు

- మూడేళ్లలో పూర్తి చేయడమే లక్ష్యం
- ఫస్ట్ ఫేజ్ లో రూ.6వేల కోట్లతో రోడ్ల నిర్మాణం
- నాకు డిపార్ట్ మెంట్ తప్పా వేరే పనిలేదు
- జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా గ్రాండ్ సక్సెస్
- రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటిరెడ్డి



**విశ్వంభర,తెలంగాణ బ్యూరో:** హ్యామ్ రోడ్ల నిర్మాణాలకు వచ్చే వారంలో టెండర్లు పిలువనున్నట్లు రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. గురువారం సెక్రటేరియట్ లో టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎన్.హెచ్.ఏ.ఐ, ఎం.ఓ.ఆర్.టీ.హెచ్, ప్రాజెక్ట్స్ కు సంబంధించి పనుల పురోగతిపై చర్చించారు. విద్యుత్ లైన్ షిఫ్టింగ్, వాటర్ యుటిలిటీ క్లియరెన్స్, ఫారెస్ట్ క్లియరెన్స్ సంబంధిత అంశాలపై మంత్రి సమీక్షించారు. సమావేశంలో రాష్ట్ర స్పెషల్ సీఎస్ వికాస్ రాజ్, సీసీఎల్ఏ కమిషనర్ లోకేష్, విద్యుత్ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, నీటిపారుదల, పంచాయతీ రాజ్, అటవీ శాఖ, మైనింగ్ శాఖల అధికారులు, ఎన్.హెచ్.ఏ.ఐ, ఎం.ఓ.ఆర్.టీ.హెచ్ రీజినల్ ఆఫీసర్స్, రైల్వే అధికారులు ఉన్నారు. అనంతరం చిట్ చాట్ లో మంత్రి మాట్లాడారు. మొదలు పెట్టిన అన్ని రోడ్ల నిర్మాణాలను వచ్చే మూడేళ్లలో పూర్తి చేయాలన్న లక్ష్యం పెట్టుకున్నట్లు వివరించారు. నాకు నా శాఖ తప్పా వేరే పనిలేదని, అందుకే వర్క లన్ని స్పీడ్ చేస్తున్నామని స్పష్టం చేశారు.

ఫస్ట్ ఫేజ్ లో రూ.6వేల కోట్లతో రోడ్ల నిర్మాణం పనులు మొదలు పెడుతున్నట్లు చెప్పారు. ట్రిబుల్ ఆర్ పై ఈ నెలాఖరు నాటి క్లారిటీ వస్తుందని చెప్పారు. 90 శాతం భూ సేకరణ పూర్తి అయిందన్నారు. ఈ నెల 12న హ్యామ్ రోడ్ పై కాంట్రాక్టర్ల తో మీటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. %యాశ్రీఎెష% పనులు కూడా త్వరలో ప్రారంభం కాబోతున్నాయన్నారు. కేంద్ర మంత్రి గడ్కరీతో జరిగిన సమావేశంలో పెండింగ్ లో ఉన్న జాతీయ రహదారులకు, విజయవాడకు ఫ్యూచర్ సిటీ నుంచి గ్రీన్ ఫీల్డ్ హైవే మంజూరు చేసేందుకు అంగీకరించారని, ట్రిబుల్ ఆర్ నార్త్ పార్ట్ ఈ నెలలో కేంద్ర కేబినెట్ లో ఆమోదం తెలుపనున్నట్లు గడ్కరీ హామీ ఇచ్చారని అన్నారు. టాస్క్ ఫోర్స్ కమిటీ మీటింగ్ జరుగడం రాష్ట్రంలో ఇదే తొలిసారి అని చెప్పారు.

అన్ని శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై చర్చించామని పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు వీలుపడుతుందని చెప్పుకొచ్చారు. సనత్ నగర్ టీమ్స్ అక్టోబర్ లో ఓపెన్ చేస్తామని, ప్రస్తుతం పనులన్ని చివరి దశ కు వచ్చాని చెప్పారు. మెడికల్ పరికరాలు వచ్చే నెలలో తీసుకొచ్చేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు.

**ఢిల్లీ ధర్నా గ్రాండ్ సక్సెస్..**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ బిల్లును పాస్ చేయించేందుకు కేంద్రంపై ఒత్తిడి తెచ్చేందుకు తలపెట్టిన ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద చేపట్టిన ధర్నా గ్రాండ్ సక్సెస్ అయిందన్నారు. రాహుల్ గాంధీ, ఖర్గే సడెన్ ప్రోగ్రామ్స్ వల్ల రాలేకపోయారు. శింబూ సోరెన్ మరణించడంతో రాహుల్ గాంధీ అక్కడికి వెళ్ళాల్సి వచ్చిందని, ఇండియా కూటమి ఎంపీలు ధర్నాకు వచ్చారని వివరించారు. కాంగ్రెస్ పార్టీలో ఫోన్ ట్యాపింగ్ సిస్టం లేదని స్పష్టం చేశారు. 10 ఏళ్ల అవినీతిపై కమిషన్ లతో విచారణ జరిపిస్తున్నామని అన్నారు. 20 నెలల కాంగ్రెస్ పాలనలో కేటీఆర్ తన డైరీలో పేర్లు రాసుకుంటున్నామని చెబుతున్నారు. గత పదేళ్ల %దీ=ూ% పాలనలో మా కార్యకర్తలులో ఎన్నో ఇబ్బందులు పడ్డారు. మేము రాయాలంటే ఎన్నో పేర్లు డైరీ లో రాసుకోవాలి, కాని ఏనాడు కూడా మేము అలా మాట్లాడలేదు, డైరీలో రాసుకోలేదని చెప్పారు. కలెక్టర్లను, ఎస్పీలను కూడా కేటీఆర్ తిడుతున్నారని మండిపడ్డారు. రాజగోపాల్ రెడ్డి వ్యాఖ్యలపై విలేకర్లు అడిగిన పశ్నకు మంత్రి కోమటిరెడ్డి సైలెంట్ గా ఉన్నారు. జగదీష్ రెడ్డిపై అడిగిన ప్రశ్నలకు మంత్రి సమాధానం ఇస్తూ జగదీష్ రెడ్డి గురించి మాట్లాడే స్థాయి నాది కాదని అన్నారు. ఉమ్మడి నల్గొండ అభివృద్ధి నా లక్ష్యం. నల్గొండ రింగ్ రోడ్ టెండర్స్ పిలిచామని చెప్పారు.

**నేడు సినిమా కార్మికులతో సమావేశం..:** శుక్రవారం సినిమా కార్మికులతో సమావేశం కానున్నారు. ఈ సమావేశంలో దిల్ రాజుతో పాటు పలువురు నిర్మాతలు భేటీకి వస్తారు. సినీ కార్మికులకు, నిర్మాతల మధ్య జరుగుతున్న వివాదాల నేపథ్యంలో సమ్మె సరుగుతుందని దానిని పరిష్కరించేందుకే సమావేశం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. సమావేశం అనంతరం ఇదో కొలిక్కి వస్తుందని అన్నారు.

## రైతుల ప్రయోజనాలపై రాజీపడే ప్రసక్తే లేదు..

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,ఢిల్లీ:** రష్యా చమురును కొనుగోలు చేస్తుందన్న కార ణంతో భారత్‌పై సుంకాలను రెట్టింపు చేశారు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్. ఇప్పటివరకు ఉన్న 25శాతం సుంకాలను 50శాతానికి పెంచుతున్నట్లు ప్రకటించారు. ఈ పరిణామాలపై భారత ప్రధానమంత్రి నరేంద్రమోడీ పరోక్షంగా స్పందించారు. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు. దివంగత వ్యవసాయ శాస్త్రవేత్త ఎం.ఎస్ స్వామినాథన్ జయంతి ఉత్సవాలను పురస్కరించుకొని దిల్లీలో నిర్వహించిన కార్యక్రమానికి ప్రధాని మోడీ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమెరికాతో వాణిజ్యం, టారిఫ్‌ల అంశాన్ని పరోక్షంగా ప్రస్తావించారు. "రైతుల సంక్షేమమే మాకు అత్యంత ప్రాధాన్యం. రైతులు, మత్స్యకారులు, పాడి రైతుల ప్రయోజనాలకు సంబంధించిన విషయాల్లో ఎన్నటికీ రాజీపడబోం. అలా చేయడం వల్ల మేం భారీ మూల్యం చెల్లించుకోవాల్సి వస్తుందని మాకు తెలుసు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా నేను సిద్ధమే. భారత్ సిద్ధమే" అని మోడీ వ్యాఖ్యానించారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం..

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర,హైదరాబాద్:** నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురుస్తోంది. కూకట్‌పల్లి, మూసాపేట, అమీర్‌పేట, ఎస్ ఆర్ నగర్, మధురానగర్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మాదాపూర్, గచ్చిబౌలి, రాయదుర్గం, ఖైరతాబాద్, కోఠి, మల క్‌పేట, దిల్‌సుఖ్‌నగర్, ఎల్బీనగర్, వనస్థలిపురం, హయత్‌నగర్, అబ్దుల్లాపూర్‌మెట్ తదితర ప్రాంతాల్లో వర్షం పడుతోంది. రోడ్లపైకి వరద నీరు చేరడంతో వాహనదారులు అవస్థలు పడుతున్నారు. సైబర్ సిటీ ట్రాఫిక్ చక్రబంధంలో చిక్కుకుంది. మాదాపూర్, హైటెక్‌సిటీ,ఐకియా, బయోడైవర్సిటీ, గచ్చిబౌలి, రాయ దుర్గం, కొండాపూర్ ప్రాంతాల్లో భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

## ఓటర్ల జాబితాలో అవకతవకలు

### - కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** కేంద్ర ఎన్నికల సంఘంపై కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ఆరోపణలు చేశారు. అనేక రాష్ట్రాల ఓటర్ల జాబితాలో నకిలీ వ్యక్తుల పేర్లు ఉన్నాయని ఆరోపిం చారు.ఎగ్జిట్ పోల్స్, ఒపీనియన్ పోల్స్‌కు వ్యతిరేకంగా ఎన్నికల ఫలితాలు వస్తున్నాయని, హరియాణా, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర ఫలితాలు తమ అనుమానాలకు బలం చేకూర్చాయని చెప్పారు. ఓటర్లజాబితాలో అవక తవకలు జరిగాయని ఆరోపించిన ఆయన.. ఇందుకు సంబంధించి మీడియా సమావేశంలో ఆ వివరాలు వెల్లడించారు.

"మహారాష్ట్రలో ఐదు నెలల్లోనే 40 లక్షల మంది ఓటర్లు నమోదయ్యారు. ఐదేళ్లలో నమోదైన వారి కంటే.. ఐదు నెలల్లో నమోదైన ఓటర్లే ఎక్కువ. మహారాష్ట్రలో లోక్‌సభ, విధానసభ ఎన్నికల మధ్య సమయంలో కోటి మంది ఓటర్లు నమోదయ్యారు. ఓటర్ల జాబితా మాకు ఇచ్చేందుకు ఈసీ నిరాకరించింది. అది దేశ సంపద.. దానిని ఎందుకు చూపించ ట్లేదు" అని రాహుల్ ప్రశ్నించారు. అసెంబ్లీ ఎన్నికల్లో అవకతవకలు జరిగాయన్న తమ అనుమానం మహారాష్ట్ర ఫలితాలతో నిజమైందన్నారు. మెషిన్ రీడ్ చేయగల ఓటరు లిస్టును ఎన్నికల సంఘం ఇవ్వకపోవడం మరిన్ని అనుమానాలకు తావిస్తోందన్నారు.

అటు కర్ణాటకలోని మహదేవపుర అసెంబ్లీ నియోజకవర్గంలో 6.5లక్షల ఓట్లకు గాను లక్ష ఓట్లు నకిలీవి, తప్పుడు చిరునామావేనని తమ పరిశోధనలో తేలిందని చెప్పారు. బెంగళూరు సెంట్రల్ లోక్‌సభ, మహదేవపుర అసెంబ్లీ సెగ్మెంట్ ఓటర్ల జాబితాను విశ్లేషించామని రాహుల్ గాంధీ వెల్లడించారు. "ఈ అసెంబ్లీ నియోజకవర్గంలో 11,965 డూప్లికేట్ ఓటర్లు, 40,009 నకిలీ, తప్పుడు చిరునామా, 10,452 బల్క్ లేదా సింగిల్ అడ్రస్, 4132 తప్పుడు ఫొటోలు ఉన్న ఓటర్లు, మరో 33,692 ఓటర్లు ఫారం-6 దుర్వినియోగం చేశారు" అని రాహుల్ గాంధీ ఆరోపించారు.

**స్పందించిన ఎన్నికల సంఘం..**

కర్ణాటకలో ఓటర్ల జాబితా విషయంలో రాహుల్ గాంధీ చేసిన ఆరోపణలపై ఆ రాష్ట్ర చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్ కార్యాలయం స్పందించింది. "ఓటర్ల జాబితాలో అనర్హులను చేర్చారని, అర్హులైన ఓటర్లను మినహాయించారని ఆరోపణలు చేశారు. ఈ నేపథ్యంలో.. సంబంధిత ఓటర్ల వివరాలు డిక్లరేషన్ రూపంలో అందజేయండి. తద్వారా అవసరమైన చర్యలు తీసుకుంటాం" అని రాహుల్ గాంధీకి ఓ లేఖ రాసింది.

## మెడికల్ కాలేజీలో గంజాయి కలకలం..



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** నగరంలోని మెడిసిటీ మెడికల్ కాలేజీలో గంజాయి కలకలం రేపింది. 'ఈగల్' పోలీసులు నిర్వహిస్తోన్న ఆపరేషన్‌లో కాలేజీకి గంజాయి సరఫరా చేస్తున్న ఇద్దరిని అరెస్టు చేశారు. ఈ క్రమంలో డ్రగ్స్ కొనుగోలు చేస్తున్న 82 మంది వినియోగదారులను పోలీసులు గుర్తించారు. వారిలో 32 మంది మెడిసిటీ మెడికల్ కాలేజీ విద్యార్థులు ఉన్నట్లుగా తేలింది.24 మంది విద్యార్థులకు డ్రగ్స్ టెస్టు చేయగా.. 9 మందికి పాజిటివ్ వచ్చింది. వీరిలో ఇద్దరు అమ్మాయిలు ఉన్నారు. వీరంతా హాస్టల్‌లో ఉంటూ చదువుకుంటున్నారు. దీంతో ఈగల్ పోలీసులు, మెడిసిటీ కాలేజీ యాజమాన్యం విద్యార్థుల తల్లిదండ్రులను పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చారు. డ్రగ్స్ వాడినట్లు తేలిన 9 మంది విద్యార్థులను డీ-అడిక్షన్ సెంటర్‌కు పంపించారు. భవిష్యత్తులో ఇలాంటి సంఘటనలు జరగకుండా ఉండేందుకు విద్యాసంస్థల్లో ఆకస్మిక తనిఖీలు కొనసాగిస్తామని ఈగల్ అధికారులు వెల్లడించారు.కర్ణాటకలోని బీదర్‌కు చెందిన జరీనా బాను, అరఫాత్ అహ్మద్‌ఖాన్ గంజా యినిహైదరాబాద్‌కు తీసుకొచ్చి పలువురు పెడ్లర్లతో సరఫరా చేయిస్తున్నారు. నిందితుల బ్యాంక్ ఖాతాలు పరిశీలించగా.. రూ.1.5కోట్ల అనుమానాస్పద లావాదేవీలు వెలుగులోకి వచ్చా యి.అందులో రూ. 26లక్షలు హైదరాబాద్‌కు చెందిన 51 మంది పెడ్లర్లు, మిగిలిన నగదు.. దాదాపు 100 మంది మధ్య లావాదే వీలు జరిగినట్లు అధికారులు గుర్తించారు. ఆ వంద మందిలో ఈ 32 మంది మెడికల్ విద్యార్థులు ఉన్నట్లు తెలిపారు.

# తేల్చుకుందామనే దేశ రాజధానికి వచ్చాం



మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో:**

విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు క్షేత్రస్థాయిలో మేము చేయాల్సిన అన్ని ప్రయత్నాలు చేశామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. బీసీ రిజర్వేషన్లపై బిల్లును ఆమోదించి రాష్ట్రపతికి పంపిస్తే నాలుగు నెలలుగా ఆ బిల్లులు పెండింగ్ లో ఉన్నాయని, ప్రభుత్వం పంపిన ఆర్డినెన్స్ ను గవర్నర్ ఆమోదించకపోగా దానిని రాష్ట్రపతికి పంపడం వల్ల సమస్య మరింత జటిలం అయిందన్నారు. వీటిని ఆమోదం వస్తే తప్ప చట్టబద్ధంగా చెల్లుబాటు కాదన్నారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్రం సహకరించడం లేదని దీంతో పార్టీ పరంగా ఇవ్వాలా మరేదైనా ఉపాయం ఉందో త్వరలోనే హైదరాబాద్ లో పీఏసీ సమావేశం నిర్వహించి చర్చిస్తామన్నారు. ఇవాళ ఢిల్లీలో మీడియాతో మాట్లాడిన రేవంత్ రెడ్డి.. 42 శాతం రిజర్వేషన్ల అమలు కోసం జాతీయ స్థాయిలో పోరాడాలనే ఉద్దేశంతోనే ఢిల్లీకి వచ్చామన్నారు.

పది రోజుల క్రితమే రాష్ట్రపతి అపాయింట్ మెంట్ కోరాం. ఆగస్టు 6,7 తేదీల్లో మీరు ఎప్పుడు అపాయింట్ మెంట్ ఇచ్చినా మేము ఢిల్లీలో అందుబాటులోనే ఉంటామని రాష్ట్రపతికి సమాచారం ఇచ్చాం. కానీ మేము అపాయింట్ మెంట్ అడిగిన తర్వాత నరేంద్ర మోడీ, అమిత్ షా రాష్ట్రపతిని కలిశారు. వీరు ఏం మాట్లాడుకున్నారో తెలిదు. కానీ తెలంగాణ ప్రభుత్వం చేసిన విజ్ఞప్తి మేరకు రాష్ట్రపతి అపాయింట్మెంట్ ఇవ్వకపోవడంతో మా మంత్రి వర్గం, మా పార్టీ అధిష్టానం నరేంద్ర మోడీ, అమిత్ షా, కేంద్ర ప్రభుత్వం మాకు రాష్ట్రపతి అపాయింట్ మెంట్ రాకుండా చేశారనే నిర్ధరణకు వచ్చామన్నారు. రాష్ట్రపతిని మేము కలిసి విజ్ఞప్తి చేస్తే మేము బీసీల రిజర్వేషన్ల బిల్లును ఆమోదించాల్సి వస్తుందనే మాకు అపాయింట్ మెంట్ రాకుండా చేశారన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఢిల్లీకి కదిలి వచ్చింది. కానీ దురదృష్టవశాత్తు మాకు రాష్ట్రపతి అపాయింట్ మెంట్ దొరకలేదన్నారు. ఇది శోచనీయం, బాధాకరం అన్నారు. ఇది తెలంగాణ ప్రజలకు అవమానకరం అన్నారు.

**బీజేపీ వితండ వాదం..**

బలహీన వర్గాల హక్కులను కాలరాయడానికి బీజేపీ మొదటి నుంచి కుట్రలు చేస్తూనే ఉందని సీఎం విమర్శించారు. నాడు మండల్ కమిషన్ ద్వారా ఓబీసీలకు న్యాయం చేయాలని చూస్తే బీజేపీ కమండల్ పాలిటిక్స్ కు తెరలేపిందని రథయాత్ర పేరుతో దేశంలో ఉద్రిక్తత పరిస్థితులు తీసుకువచ్చిందని ఆరోపించారు. మేము మొదలు పెట్టిన ఓబీసీ రిజర్వేషన్ల పెంపును ఎలాగైనా అడ్డుకోవాలని బీసీ ద్రోహులుగా ఉన్న బీజేపీ ముస్లింలకు రిజర్వేషన్లు కల్పిస్తున్నామని వితండవాదం చేస్తోందని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. మేము పంపిన బిల్లుల్లో ఎక్కడైనా మతానికి ప్రత్యేకమైన రిజర్వేషన్ ఉందా అని ప్రశ్నించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్ల అంశం మాత్రమే ఉందని కులాలు ఉప కులాల వారీగా రిజర్వేషన్లు లేవన్నారు. కానీ కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ మాత్రం ముస్లింలకు రిజర్వేషన్లు ఇస్తున్నాం కాబట్టి అడ్డుకుంటున్నామని వితండ వాదం చేస్తున్నారని మండిపడ్డారు. ఇంతకు వీళ్లు చదువుకున్నారా? లేక రాజకీయ ప్రేరేపితంతో చట్టాన్ని చదవకుండా కళ్లుమూసుకుని మాట్లాడుతున్నారో తెలియడం లేదన్నారు. వివిధ వృత్తులు చేపట్టే ముస్లింలకు చట్ట ప్రకారమే ఓబీసీలకు రిజర్వేషన్లు ఉన్నాయని ఇవి మహారాష్ట్ర, గుజారాత్, ఉత్తరప్రదేశ్ లో కూడా ఉన్నాయన్నారు. ఓబీసీలు అమాయకులేమి కాదని వారు చట్టం చదువుకున్నారు. వారికి సామాజిక స్పృహ ఉందన్నారు. గల్లీ లీడర్లు మాట్లాడినట్లు కిషన్ రెడ్డి మాట్లాడటం భావ్యం కాదు. ముస్లింలకు రిజర్వేషన్లు ఇవ్వద్దని బీజేపీ భావిస్తే అలాగే చట్టం చేయండి. ముస్లింలను మినహాయించి బీసీలకు రిజర్వేషన్లు ఇస్తూ కేంద్రం చట్టం చేయవచ్చు కదా అని ప్రశ్నించారు. కేంద్రం తలచుకుంటే రెండ్రోజుల్లోనే చట్టం ఆమోదం పొందుతుంది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు మా విధానం.. బీజేపీ విధానం ఏమిటో చెప్పాలన్నారు.

**బీఆర్ఎస్ శిఖండి పాత్ర..**

బీజేపీ బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేస్తుంటే బీఆర్ఎస్ శిఖండి పాత్ర పోషిస్తోందని సీఎం ధ్వజమెత్తారు. ఎలాగైనా కాంగ్రెస్ ను దెబ్బతీయాలని ప్రభుత్వం చేస్తున్న ఏ మంచి పనికి సహకరించమని బీజేపీతో అంటకాగుతోందన్నారు. బీజేపీ తప్పిదాలను బీఆర్ఎస్ ఎందుకు ప్రశ్నించడం లేదు? నిన్నటి ధర్నాలో బీఆర్ఎస్ పాల్గొనలేదని ప్రశ్నించారు. ధర్నాలో పాల్గొనకుండా మమ్మల్ని అవమానిస్తోందని దుయ్యబట్టారు. తాటిచెట్టంత పెరగడం కాదు ఆవగింజంత అవగాహన కూడా ఉండాలన్నారు. మమ్మల్ని బలహీనం చేసేట్టు, మా చేతులు కట్టేసేట్టు వ్యవహరిస్తోంది తప్పా బీసీలకు మద్దతుగా నిలబడదామన్న సోయి లేకుండా పోయిందన్నారు. బీఆర్ఎస్ బీసీలకు కనీసం నైతిక మద్దతు కూడా ఇవ్వడం లేదన్నారు. రిజర్వేషన్లు 50 శాతం మించకూడదని గతంలో చట్టం చేయడం ద్వారా బీఆర్ఎస్, 42 శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లులు ఆమోదించకుండా బీజేపీ బీసీ ద్రోహులుగా మిగిలిపోతారన్నారు. తాత్కాలికంగా మీరు విజయం సాధించామని అనుకోవచ్చు.

కానీ ఏ సమస్యను దీర్ఘకాలికంగా వాయిదా వేసినా అది మిమ్మల్నే బలి తీసుకుంటుందన్నారు. చిత్తశుద్ధితో మూడు రోజులుగా రిజర్వేషన్ల బిల్లు ఆమోదం కోసం మేము ప్రయత్నం చేస్తుంటే కేంద్ర నుంచి ఏ మాత్రం సహకారం లేదని ఇకనైనా రాష్ట్రపతి బిల్లులను ఆమోదించేలా సూచన చేయాలని, మేము కూడా రాష్ట్రపతికి విజ్ఞప్తి చేస్తున్నామన్నారు. బీఆర్ఎస్ కనీసం నైతిక చర్యగా నైనా బీసీలకు మద్దతు ఇవ్వడం లేదన్నారు.

**పీఏసీలో చర్చించి భవిష్యత్ కార్యాచరణ..**

బీఆర్ఎస్,బీజేపీ దుర్మార్గమైన చర్యలను తెలంగాణ సమాజం గమనిస్తోందని వీరితీరును ఎండగట్టేందుకు కాంగ్రెస్ భవిష్యత్ కార్యాచరణ తీసుకుంటుందని సీఎం చెప్పారు. త్వరలోనే ఇందుకోసం హైదరాబాద్ లో పీఏసీ సమావేశం ఏర్పాటు చేసి కీలక సమావేశం నిర్వహిస్తామన్నారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనేది మా విధానం అని పార్టీ పరంగా ఇవ్వాలా, మరేదైనా ఉపాయం ఉందేమో పీఏసీలో చర్చిస్తామన్నారు. హైకమాండ్ అభిప్రాయంతో కోర్టులో వాదన వినిపిస్తామన్నారు.

బిల్లులు, ఆర్డినెన్స్ ను రాష్ట్రపతి ఆమోదించకుంటే పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా ఎలా ముందుకు వెళ్లాలనేదానిపై పీఏసీ సమావేశంలో చర్చిస్తామన్నారు. నిన్నటి ధర్నాలో రాహుల్, ఖర్గే రాలేదన్న వాదన అర్థరహితం అన్నారు. కిషన్ రెడ్డికి అనుమానాలు ఉంటే అధికారిక మీటింగ్ ఏర్పాటు చేసి ఆయనకు అవగాహన కల్పిస్తామన్నారు. అన్ని కులాల వివరాలు సేకరించి కులగణన చేశామన్నారు.



## పంద్రాగస్టు వేడుకలకు పటిష్ఠ భద్రత

### 10వేల మంది పోలీసులు మోహరింపు

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:** స్వాతంత్ర్య దినోత్సవానికి దేశ రాజధాని ఢిల్లీ సిద్ధమవుతోంది. ఎర్రకోట వేదికగా ప్రధాని నరేంద్ర మోడీ జాతీయ జెండాను ఎగురవేసి, దేశ ప్రజలను ద్దేశించి ప్రసంగించనున్నారు. ఈ నేపథ్యంలో అధికారులు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. శాంతిభద్రతలను కాపాడేందుకు డిల్లీ వ్యాప్తంగా 10 వేలమందికిపైగా సిబ్బందిని మోహరించినట్లు పోలీసు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఎర్రకోట వద్ద బహుళ అంచెల భద్రతను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. "భద్రతా విధుల కోసం పారామిలిటరీ దళాలు, ప్రత్యేక కమాండోలు సహా 10 వేలమందికిపైగా సిబ్బందిని నియమించాం. సీసీటీవీ కెమెరాల ద్వారా నిఘా ఉంచుతాం. యాంటీ డ్రోన్ వ్యవస్థలు, ముఖ గుర్తింపు సాంకేతికతలను వినియోగిం చనున్నాం. స్నైపర్లు, నిఘా బృందాలను మోహరించనున్నాం. సున్నిత, నిషేధిత ప్రాంతాలపై మరింత దృష్టి సారించను న్నాం" అని అధికారులు వెల్లడించారు. సెక్యూరిటీ విషయం లో ఎటువంటి లోపాలకు తావులేకుండా.. కేంద్ర భద్రతా సంస్థలు, నిఘా విభాగాలతో సమన్వయం చేసుకుంటున్నట్లు చెప్పారు. తప్పుడు సమాచార వ్యాప్తి, ఆన్‌లైన్ బెదిరింపులను కట్టడి చేసేందుకు సోషల్ మీడియాపైనా దృష్టి సారించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. స్వాతంత్ర్య దినోత్సవం నేపథ్యంలో దిల్లీలో ఈ నెల 16 వరకు పారాగ్లైడర్లు, హ్యాంగ్‌గ్లైడర్లు, డ్రోన్లు,హాట్ ఎయిర్ బెలూన్ల వంటి వాటిపై ఇప్పటికే నిషేధం విధించారు.



## త్వరలో భారత పర్యటనకు పుతిన్..!

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, నేషనల్ బ్యూరో:**

రష్యా అధ్యక్షుడు పుతిన్ త్వరలో భారత్ పర్యటనకు రానున్నట్లు తెలుస్తోంది. ఆయన పర్యటన తేదీలు ఖరారు చేస్తున్నట్లు జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్ వెల్లడించారు. ప్రస్తుతం రష్యా పర్యటనలో ఉన్న డొభాల్.. క్రెమ్లిన్ వేదికగా నిర్వహించిన సమావేశంలో రష్యా భద్రతామండలి సెక్రటరీ సెర్గీ షోయిగు, క్రెమ్లిన్ సహాయకుడు యూరి ఉషకోవ్ పాల్గొన్నారు. అనంతరం ఆ దేశాధినేత పుతిన్‌తో భేటీ అయ్యారు. రష్యా నుంచి చమురు కొనుగోళ్ల నేపథ్యంలో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు విధించిన వేళ ఈ ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

ఈ ఏడాది చివర్లో పుతిన్ భారత్‌కు వచ్చే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. 2022 ఫిబ్రవరిలో ఉక్రెయిన్‌పై దండయాత్ర అనంతరం ఆయన భారత్‌కు రావడం ఇదే మొదటిసారి అవుతుంది. ఇదిలా ఉండగా.. గత ఏడాది ప్రధాని మోదీ, పుతిన్ రెండుసార్లు కలుసుకున్నారు. జులైలో ఇరుదేశాల శిఖరాగ్ర సమావేశానికి ప్రధాని మోదీ మాస్కోకు వెళ్లారు.ఆ సందర్భంలో ఆయన ఆ దేశ అత్యున్నత పౌర పురస్కారం 'ఆర్డర్ ఆఫ్ సెయింట్ ఆండ్రూ ది అపోస్టల్' అందుకున్నారు. అక్టోబరులో బ్రిక్స్ సదస్సు సందర్భంగా కజాన్‌లో మరోసారి సమావేశమయ్యారు.

# అధికారంలోకి వస్తాం.. అందరి లెక్కలు సరిచేస్తాం

## యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోంది

మొదటిపేజీ తరువాయి...

**విశ్వంభర, హైదరాబాద్:** రెండున్నరేళ్లలో భారత రాష్ట్ర సమితి పార్టీ మళ్లీ అధికారంలోకి వస్తుందని, అప్పుడు అందరి లెక్కలు సరిచేస్తామని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. "కేసీఆర్ పాలనలో అందరికీ న్యాయం జరిగింది. ఇప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి విచిత్రంగా ఉంది. భూములు విలువలు పడిపోయాయి. యూరియా కోసం రైతులు కష్టపడాల్సి వస్తోంది.

పదేళ్లలో రేషన్ కార్డులు ఇవ్వలేదని ఐఏఎస్ అధికారులు అబద్ధాలు చెబుతున్నారు. ఐఏఎస్‌లు రాజకీయాలు మాట్లాడటం సరికాదు. రుణ మాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైంది. కాంగ్రెస్‌పై రైతులు ఆగ్రహంతో ఉన్నారు. ఓట్లు ఉన్నప్పుడు కాదు.. నాట్లు వేసేటప్పుడు రైతుబంధు ఇవ్వాలి. స్థానిక సంస్థల ఎన్నికలు ముగిశాక ప్రభుత్వం రైతుబంధు నిలిపివేస్తుంది. ప్రభుత్వం అసెంబ్లీ సమావేశాలుపెట్టి బీసీ సబ్‌ప్లాన్‌ను ప్రవేశపెట్టాలి. రేవంత్‌రెడ్డికి కేసీఆర్ అంటే భయం పట్టుకుంది.



అందుకే ఢిల్లీలో కూడా ఆయన్నే విమర్శిస్తున్నారు. భారత రాష్ట్ర సమితి పాలనలో జరిగిన మంచి పనులు కార్యకర్తలు చెప్పలేకపోయారు.. అందుకే ఓ డిపోయాం. కేసీఆర్‌ను మళ్లీ సీఎంను చేయడానికి అందరం కలిసికట్టుగా పనిచేయాలి"అని కేటీఆర్ అన్నారు.

# మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకం

## - కేంద్రమంత్రి కిషన్ రెడ్డి

**విశ్వంభర,తెలంగాణ బ్యూరో:** మతపరమైన రిజర్వేషన్లకు బీజేపీ వ్యతిరేకమని, ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్లను తీసివేస్తే బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల విషయంలో తాను వ్యక్తిగతంగా బాధ్యత తీసుకుంటానని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఢిల్లీలో మీడియాతో మాట్లాడుతూ ముస్లింలకు 10 శాతం రిజర్వేషన్ల అంశాన్ని తొలగిస్తే, తాను స్వయంగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని మోడీలతో మాట్లాడతానని తెలిపారు. బీసీ రిజర్వేషన్లతో ముస్లింలను ఎలా ముడిపెడతారని ప్రశ్నించారు. ఈ విషయంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పునరాలోచించుకోవాలని సూచించారు.

అసదుద్దీన్ ఒవైసీ, అజారుద్దీన్, షబ్బీర్ అలీ వంటి వారు బీసీలు ఎలా అవుతారని ప్రశ్నించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాకముందు ఆరు గ్యారంటీలు 420సబ్ గ్యారంటీలతో ఆశచూపి అధికారంలోకి వచ్చిందన్నారు. ఆ తర్వాత ఏ ఒక్క హామీని అమలు చేయలేని నిస్సహాయ పరిస్థితుల్లో, పాలనలో వైఫల్యంతో, చేతకానితనంతో, అప్పులు తీర్చేందుకు అప్పులు చేస్తూ రాష్ట్ర ఆర్థికవ్యవస్థను అథ:పాతాళానికి తొక్కేశారని మండిపడ్డారు. తెలంగాణలో ఇచ్చిన హామీలకు



రేవంత్ తోపాటుగా రాహుల్ గాంధీ, సోనియాగాంధీ పూర్తి బాధ్యత వహించాలన్నారు.

బీసీలకు ఇచ్చిన 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో న్యాయబద్ధంగా చర్చించి ఇచ్చే ప్రయత్నం చేయాలన్నారు. నాడుకేసీఆర్ ప్రభుత్వం రాష్ట్రాన్ని ప్రైవేట్ లిమిటెడ్ సంస్థగా మార్చి హోల్ సేల్‌అవినీతి చేస్తే, కాంగ్రెస్ పార్టీ రిటెయిల్ గా అవినీతికి పాల్పడుతోంది. అవినీతిలో అగ్రస్థానం, అప్పుల్లో అగ్రస్థానంలో తెలంగాణ రాష్ట్రం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు.

**మతపరమైన రిజర్వేషన్లను పెట్టిందుకు కాంగ్రెస్ కుట్రలు..**

దేశంలో అశాంతిని సృష్టించేందుకు కాంగ్రెస్?ప్రయత్నం చేస్తుందని, బీసీ సామాజిక వర్గానికి మోసం చేయడమే ఆపార్టీ పెద్దలుగా అలవాటుగా మారిందన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు మజ్లిస్ చెప్పినట్లే నాటకాలు చేస్తాయని వారు చెప్పినట్లే అసెంబ్లీలో వ్యవహరించడంతో పాటు పాలన అదే విధంగా చేస్తారని దుయ్యపట్టారు. జనగణన తూతూ మంత్రంగా నిర్వహించారని, హైదరాబాద్ నగరంలో 25 శాతం మంది ఇళ్లలోకి వెళ్లకుండా దాన్ని గొప్ప సర్వేగా చెప్పుకోవడం సిగ్గుచేటు దీన్నిబీసీ సమాజం అర్థం చేసుకోవాలని సూచించారు.రాష్ట్రపతి స్థానంలో ఉన్న మహిళపై తెలంగాణలోని ఓ మహిళా మంత్రి వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాను. మంత్రి వ్యాఖ్యలపై సోనియా గాంధీ బేషరతుగా క్షమాపణలు చెప్పాలి. రాజకీయ వేదికలపై ఇలా దిగజారి..

రాజకీయంగా సంబంధం లేని రాష్ట్రపతి గారి గురించి అలాంటి వ్యాఖ్యలు చేయడం సిగ్గుచేటు. ఇది ముమ్మాటికీ దేశంలోని మహిళలకు అవమానకరం అన్నారు. ఏ ఎన్నికలు జరిగినా బీసీలకు పెద్దపీట వేసి వారికి వెన్నంటి ఉండే ఏకైక పార్టీ బీజేపీ అని పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టు ఆదేశాలను అనుసరించి చర్యలు తీసుకుంటాం



విశ్వంభర, హైదరాబాద్:బీఆర్ఎస్ నుండి కాంగ్రెస్ పార్టీలోకి ఫిరాయించిన 10 మంది ఎమ్మెల్యేల అనర్హత విషయంలో సుప్రీంకోర్టు ఆదే శాలను అనుసరించి చర్యలు తీసుకుంటున్నట్లు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు. ఎమ్మెల్యేల అనర్హత విషయంలో తీసుకోవడానికి స్పీకర్‌కు సుప్రీంకోర్టు మూడు నెలల గడువు విధించిన విషయం తెలిసిందే. అంటే అక్టోబర్ 31, 2025లోపు నిర్ణయం తీసు కోవాలి. సుప్రీం ఆదేశాలపై స్పీకర్ మాట్లాడుతూ... సుప్రీంకోర్టు తీర్పు పూర్తి కాపీ అందిన తర్వాత న్యాయ నిపుణులతో సంప్రదించి, తదుపరి చర్యలను తీసుకుంటానని పేర్కొన్నారు. అలాగే ఆ 10 మంది ఎమ్మెల్యేలకు నోటీసులు పంపించామని, వారు సమయం కావాలని కోరినట్టు తెలిపారు. అయితే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల అనంతరం 10 మంది బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. దానం నాగేందర్ (ఖైరతాబాద్), తెల్లం వెంకట్ రావు (భద్రాచలం), కడియం శ్రీహరి (స్టేషన్ ఘనపూర్), పోచారం శ్రీని వాస్ రెడ్డి (బాన్సువాడ), ఎం.సంజయ్ కుమార్ (జగిత్యాల), అరెకపూడి గాంధీ (శేరిల్లింగంపల్లి), టి. ప్రకాష్ గౌడ్ (రాజేంద్రనగర్), బి. కృష్ణ మోహన్ రెడ్డి (గద్వాల్), జి. మహిపాల్ రెడ్డి (పటాన్‌చెరు), కాలె యాదయ్య (చేవెళ్ల) కాంగ్రెస్‌లో చేరారు. అయితే తాము ఆంటీ–డిఫెక్షన్ చట్టం కింద అనర్హతకు గురి కామని, తాము ఇప్పటికీ బీఆర్ఎస్ సభ్యులుగానే ఉన్నామని,ముఖ్యమంత్రిని కేవలం మర్యాదపూర్వకంగా కలిసినట్లు ఈ ఎమ్మెల్యేలు కోర్టులో అఫిడవిట్‌లు సమర్పించారు. కానీ కోర్టులో పార్టీ మారినట్టు బిఆర్ఎస్ బలమైన సాక్ష్యాలను చూపించడంతో వారిపై చర్యలు తీసుకోవాలని ధర్మాసనం తీర్పు వెలువరించింది.

## క్షణం ఆలోచించకుండా రాజకీయ సన్యాసం తీసుకుంటా..



విశ్వంభర, హైదరాబాద్: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి ఘాటు వ్యాఖ్యలు చేశారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ సీఎం రేవంత్ రెడ్డి సవాల్ చేశారు. దమ్ము, ధైర్యం ఉంటే రాష్ట్రంలో తక్షణమే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి స్థానంలో ఉన్న ఆయన.. రాష్ట్రంలోని అన్ని జడ్పీలను గెలిచి చూపించాలి సవాల్ చేశారు. కాంగ్రెస్ అన్ని జడ్పీలు గెలిస్తే రాజకీయ సన్యాసం తీసుకుంటా అని సంచలన ప్రకటన చేశారు. బీసీ రిజర్వేషన్ల పేరిట రేవంత్ నాటకాలు ఆపాలని అన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ గురించి మాట్లాడే అర్హత రేవంత్, రాహుల్ ఇద్దరికీ లేదని అన్నారు. మోడీని ప్రధాని పదవి నుంచి దింపేయడం రాహుల్, సోనియా వల్లే కాలేదు.. ఇక రేవంత్ రెడ్డి సామర్థ్యం ఎంతో చూసుకోవాలని చెప్పారు. అంతేకాదు.. ఈ జన్మలో రాహుల్ గాంధీ ప్రధాని కాలేదని ఘాటు వ్యాఖ్యలు చేశారు.

## చేనేత కార్మికులు సంఘటితం కావాలి : బండారు దత్తాత్రేయ




విశ్వంభర, భూదాన్ పోచంపల్లి: ప్రపంచ పర్యాటక ప్రాంతంగా పేరొందిన భూదాన్ పోచంపల్లిలో క్లస్టర్ డెవలప్మెంట్ ప్రోగ్రాం సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడి పోచంపల్లిలో ఏర్పాటు చేసేలా కృషి చేస్తానని హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. గురువారం భూదాన్ పోచంపల్లి పురపాలక కేంద్రంలో 11వ జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత విగ్రహానికి, కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహాలకు పూలమాలవేసి నివాళులర్పించారు.అనంతరం చేనేత సహకార సంఘం భవనంలో చేనేత ఇక్కత్ వస్త్రాలను పరిశీలించి కార్మికులతో ముఖాముఖి కార్యక్రమం నిర్వహించారు. అదేవిధంగా పట్టణంలోని చేనేత కార్మికుల గృహాలను సందర్శించి చేనేత మగ్గాలపై తయారు చేసే చీరల పనితీరును, నూలు దారం, రంగులు అద్దకం, ఆసు యంత్రం పని తీరు ప్రక్రియను పరిశీలించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చేనేత కుటీర పరిశ్రమను జాతీయ చేనేత దినోత్సవంగా ప్రకటించిన ప్రధాని నరేంద్ర మోడీకి కృతజ్ఞతలు తెలిపారు. చేనేత వస్త్రాలకు విదేశాలలో సైతం ప్రత్యేక గుర్తింపు లభించిందని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత మార్కెటింగ్ వ్యవస్థను బలోపేతం చేయాలని, అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో చేనేత వస్త్రాలు వాడే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. కొండా లక్ష్మణ్ బాపూజీకి భారతరత్న వచ్చే విధంగా కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతానన్నారు. నులు దారం, రంగులపై తక్కువ వడ్డీతో చేనేత కార్మికులకు రుణాలు అందించాలని, ఆరోగ్య బీమా, పిల్లలకు ఉన్నత విద్య అందేలా స్కీములు ఏర్పాటు చేయాలన్నారు. చేనేత సహకార సంఘాల ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వంతో చర్చిస్తానని, రాజకీయాలకు అతీతంగా చేనేత కార్మికులు సంఘటితం కావాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, కర్నాటి ధనంజయ, సీత శ్రీరాములు, ఎన్నం శివకుమార్, నోముల గణేష్, భారత వాసు, చిక్క కృష్ణ, భారత లవ కుమార్, అంకం పాండు, మెరుగు శశికళ, కర్ణాటి అంజమ్మ, దోర్నాల గణేష్, గుద్దేటి పాండు, చింతకింది కిరణ్, బడుగు శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

## అమెరికాపైనా ప్రతీకార సుంకాలు విధించాలి: శశిథరూర్



విశ్వంభర, నేషనల్ బ్యూరో: రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్నారనే కారణంతో భారత్‌పై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ 50శాతం సుంకాలు విధించడాన్ని కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ తీవ్రంగా తప్పుబట్టారు. అమెరికా దిగుమతులపై కూడా భారత ప్రభుత్వం అలాంటి చర్యలే తీసుకోవాలన్నారు. గురువారం పార్లమెంటు వెలుపల ఆయన మీడియాతో మాట్లాడారు. అమెరికా విధించిన సుంకాలు మనపై కచ్చితంగా ప్రభావం చూపిస్తాయన్నారు. దాదాపు 90 బిలియన్ డాలర్ల మేర ఎగుమతులు జరుగుతున్నాయన్నారు. సుంకం ఎక్కువగా ఉన్నప్పుడు భారత్ వస్తువులు ఎందుకు కొనాలి అని కొనుగోలుదారులు కూడా ఆలోచిస్తారన్నారు. రష్యా నుంచి భారత్ కంటే చైనా ఎక్కువ చ మురు కొనుగోలు చేస్తోందని.. కానీ, ఆ దేశానికి ట్రంప్ సుంకాల నుంచి 90 రోజుల ఉపశమనం కల్పించారన్నారు. మనకు మాత్రం మూడు వారాలే ఉపశమనం కల్పించడం సమంజసం కాదన్నారు. కేంద్రం కూడా యూఎస్ దిగుమతులపై 50శాతం సుంకం విధించాలని కోరారు. మరే దేశం కూడా మనపై ఇలా బెదిరింపులకు దిగకూడదన్నారు. ఇప్పటికే భారత్‌పై 25శాతం సుంకాలు విధించిన ట్రంప్ దాన్ని 50శాతానికి పెంచారు. అంతకుముందు ప్రకటించిన పాత 25శాతం సుంకాలు గురువారం నుంచి అమల్లోకి వచ్చాయి. కొత్తగా విధించిన 25శాతం టారిఫ్‌లు ఈనెల 27 నుంచి అమల్లోకి రానున్నాయి. భారతీయ వస్త్ర పరిశ్రమ, ఆక్వా రంగం, తోలు ఉత్పత్తులపై ఇది వెంటనే ప్రభావం చూపనుంది. ట్రంప్ విధించిన సుంకాలపై ప్రధాని మోదీ మాట్లాడుతూ.. రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదన్నారు. రైతుల ప్రయోజనాలను కాపాడటం కోసం వ్యక్తిగతంగా ఎంత చెల్లించేందుకైనా సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు.

## 11.5 కేజీల గంజాయి పట్టివేత



విశ్వంభర, చైతన్యపురి: తీగ లాగితే డొంకంతా కదిలినట్లు.. నగరంలోని చైతన్యపురిలో ఓ వ్యక్తి వద్ద గంజాయి లభించడంతో పోలీసులు దర్యాప్తు చేపట్టగా.. వాటిని విక్రయిస్తున్న వ్యక్తులు చిక్కారు. వారి నుంచి 11.5కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం..చైతన్యపురిలో భూక్య శ్రీకాంత్ అనే వ్యక్తిని పోలీసులు అరెస్టు చేసి అతడి నుంచి 340 గ్రాముల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. అది ఎక్కడ నుంచి వచ్చిందని అతడిని ప్రశ్నించినప్పుడు అబ్బాస్ అనే వ్యక్తి వద్ద నుంచి తీసుకొచ్చానని నిందితుడు చెప్పాడు. అతడు ఇచ్చిన సమాచారంతో అతడి ఇంటికి వెళ్తే 850 గ్రాముల గంజాయి లభించింది. పోలీసులు అతడిని కూడా అరెస్టు చేసి విచారించారు. రెండో నిందితుడిని ఆరా తీయగా.. నడిమింటి మమత అనే మహిళ ఇంట్లో 10.693 కిలోల గంజాయి పట్టుబడింది. వీటి విలువ రూ. 6లక్షలు ఉంటుందని పోలీసులు తెలిపారు. ఈ రెండు కేసుల్లో నలుగురిపై కేసు నమోదు చేశామని, ముగ్గురిని అరెస్టు చేయగా.. ఒకరు పరారీలో ఉన్నారని చెప్పారు.

# రాష్ట్రంలో రెండు జాతీయ పార్టీలు మిలాఖత్

### - మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి-పద్మా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన మెదక్ కలెక్టరేట్ వద్ద రైతు మహా ధర్నా



విశ్వంభర, మెదక్ ప్రతినిధి : ప్రధాని మోదీని టార్గెట్ చేసి రాష్ట్ర సీఎం రేవంత్ రెడ్డి విమర్శలు చేస్తే లోకల్ బీజేపీ నేతలు ఎందుకు మౌనంగా ఉంటున్నారని మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి ప్రశ్నించారు. మెదక్ కలెక్టరేట్ వద్ద రైతు మహా ధర్నా గురువారం జిల్లా అధ్యక్షురాలు పద్మా దేవేందర్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. మాజీ మంత్రి హరీష్ రావు, నిరంజన్ రెడ్డిలు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్ రెడ్డి మాట్లాడుతూ రెండు జాతీయ పార్టీలు ఒక్కటే అనేందుకు రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలే నిదర్శనం గా పేర్కొన్నారు.పార్లమెంట్ ఎన్నికల్లో రెండు పార్టీల మధ్య లోపాయికారి ఒప్పందం తోనే బరిలో నిలిచాయని, మోడీ ని బడే బాయ్ అంటూ స్పందించిన విషయాన్ని గుర్తు చేశారు. కాంగ్రెస్ అధిస్టానం రేవంత్ రెడ్డి పై అక్షింతలు వేయడం తో వారి మెప్పు కోసం మళ్ళీ మోడిని టార్గెట్ చేసి విమర్శలు చేసి అధిష్టానం మెప్పుకోసం ప్రయత్నం చేస్తున్నాడని ఆరోపించారు. బీజేపీ ప్రధాని పై రాష్ట్ర సీఎం ఒక వైపు ఘాటుగా విమర్శలు చేస్తే ఇద్దరు కేంద్ర మంత్రులు, ఎనిమిది మంది ఎంపీలు అందుకు రేవంత్ రెడ్డి పై మాట్లాడటం లేదని నిలదీశారు. ఈటెల, కామ రెడ్డి ఎమ్మెల్యే వేంకట రమణా రెడ్డి, మరో ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి మినహా బీజేపీ నేతలంతా కాంగ్రెస్ లో మిలాఖత్ అయ్యారని ఆరోపించారు. రాసి పెట్టుకోండి ఈ రెండు పార్టీలు ఒక్కటే అనే విషయం త్వరలో రాష్ట్రంలో అందరికీ తెలిసి వస్తుందని చెప్పారు. పదేళ్ల బీ ఆర్ ఎస్ పాలనలో వ్యవసాయం అన్ని రంగాల్లో అగ్రగామిగా ఉంటే కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత మళ్ళీ పాత రోజులు వచ్చాయన్నారు. కరెంట్ కోతలు, యూరియా కోసం చెప్పులు, రైతు బంధు కోసం నిరీక్షణ, ధాన్యం డబ్బులు మంజూరులో జాప్యం ఇలా అన్ని విషయాల్లో రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటోందని చెప్పారు. రైతు బంధు 15 వేలు, రెండు లక్షల రుణ మాఫీ, సాగు చేసిన పంటకు బోనస్ అంటూ కాంగ్రెస్ పార్టీ చూపిన ఆశ కు రైతులు నమ్మి మోస పోయారన్నారు. పెట్టుబడి సాయం ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలముందని, స్థానిక సంస్థల ఎన్నికల కోసమే ఇటీవల రైతు బంధు ఇచ్చిందని అన్నారు. మళ్ళీ కాంగ్రెస్ పార్టీని నమ్మి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు వేస్తే రైతు బంధు పూర్తిగా బంధు కావడం తో పాటు వ్యవసాయ అవసరాలు కూడా అందని దుస్థితి మళ్ళీ వస్తుందని హెచ్చరించారు. పంట పండిస్తే బోనస్ లేదా ఇస్తామని చెప్పి హామీనిచ్చిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత సన్న రకం ధాన్యం కే ఇస్తామని మెలిక పెట్టి అన్నదాతలను మోసం చేసిన విషయాన్ని గుర్తు చేశారు. రెండు లక్షల రుణ మాఫీ పై గొప్పలు చెప్పి 42 వేల కోట్ల రైతు రుణాలు ఉంటే 20 వేల కోట్లు కూడా చేయలేదన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి ఎలాంటి ప్రణాళిక లేదని, యూరియా విషయంలో ప్రభుత్వం ఆరు నెలల ముందే ప్రణాళికలు సిద్ధం చేసి కేంద్రం కు పంపితే సకాలంలో యూరియా వస్తుందని, తమ ప్రభుత్వంలో అదే చేసి యూరియా కొరత రాకుండా చేస్తున్నారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వానికి రైతుల పై ఎలాంటి ప్రేమ లేదని, వారి దందాలు ముఖ్యం తప్ప రైతుల సమస్యలు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి 600 రోజులు అవుతుందని, రాష్ట్రంలో రోజుకు ఒక రైతు ఆత్మహత్య చేసుకున్నట్లు చెప్పారు. ప్రాజెక్టుల్లో నీరు ఉన్నా కూడా సాగుకు ఇవ్వలేదని విధంగా ప్రభుత్వ తీరు ఉందని, పాలకుల్లో సాగు పై ఎలాంటి అవగాహన లేకపోవడం వల్లే రైతులు అనేక కష్టాలు పడాల్సి వస్తుందని విమర్శించారు. కాంగ్రెస్ కు సరైన బుద్ధి చెప్పాలంటే రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో సరైన నిర్ణయం తీసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలని కోరారు. రైతాంగం కూడా ప్రభుత్వ తీరును, కల్పిస్తున్న ఇబ్బందులను గుర్తించాలని కోరారు. నర్సాపూర్, దుబ్బాక ఎమ్మెల్యేలు సునీతా రెడ్డి, కొత్త ప్రభాకర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే క్రాంతి కిరణ్, శశిధర్ రెడ్డి, శేరి సుభాష్ రెడ్డి, హేమలత శేఖర్ గౌడ్, మల్లికార్జున్ గౌడ్, బట్టి జగపతి తో పాటు పలువురు నేతలు ఉన్నారు.

**మధ్యలోనే వెళ్లిపోయిన మాజీ మంత్రి హరీష్ రావు..**

మెదక్ లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద నిర్వహించిన రైతు మహా ధర్నా కు ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి హరీష్ రావు మధ్యలోనే తిరిగి వెళ్లిపోయారు. వక్తలు ప్రసంగిస్తున్న సమయంలో చివరి వరకు ఉన్న మాజీ మంత్రి మళ్ళీ వస్తా అంటూ చెప్పి వెళ్లిన హరీష్ రావు తిరిగి రాలేదు. నిరంజన్ రెడ్డి ప్రసంగం తర్వాత కలెక్టరేట్ లో రైతు సమస్యలపై వినతి పత్రం అందజేశారు.

## జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ జ్యుడీషియల్ మెంబర్‌గా వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి



విశ్వంభర, హైదరాబాద్: కేంద్ర ప్రభుత్వం తెలంగాణ హైకోర్టు సీనియర్ న్యాయవాది వేమిరెడ్డి భాస్కర్ రెడ్డిని గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ జ్యుడీషియల్ సభ్యుడిగా నియమించింది. జీఎస్టీ అప్పిలేట్ ట్రైబ్యునల్ దేశ వ్యాప్తంగా పూర్తిగా అందుబాటులోకి తీసుకురావాలన్న కేంద్ర ప్రభుత్వం ఈ నియామకాలను చేపట్టింది. మొత్తం 53 మందిని జ్యుడీషియల్ మెంబర్లుగా నియమిస్తూ గురువారం ఉత్తర్వులు జారీ అయ్యాయి. జీఎస్టీ విధానంలో వివాదాల పరిష్కారానికి ఇది ఒక ముందడుగని విశ్లేషకులు పేర్కొంటున్నారు. అయితే, గూడ్స్ అండ్ సర్వీసెస్ ట్యాక్స్ అప్పిలేట్ ట్రైబ్యునల్ జ్యుడీషియల్ సభ్యుడి ఎంపికైన వేమిరెడ్డి భాస్కర్ రెడ్డి తెలంగాణ హైకోర్టులో సీనియర్ న్యాయవాదిగా సేవలందిస్తున్నారు. ఆయన 1987లో న్యాయవాదిగా నమోదు చేసుకుని.. అప్పటి నుంచి హైదరాబాద్ హైకోర్టులో ప్రాక్టీస్ చేస్తున్నారు. పన్నుల చట్టాలలో ఆయనకు మంచి ప్రావీణ్యం సంపాదించారు. ఇదే అనుభవంతో 1993లో పన్నుల విభాగంలో ప్రత్యేక అసిస్టెంట్ ప్రభుత్వ ప్లీడర్‌గా నియమితులై జూన్ 1994 వరకు ఆ పదవిలో కొనసాగారు. తెలంగాణ హైకోర్టు 2022లో ఆయనను సీనియర్ న్యాయవాదిగా గుర్తించింది. అప్పటి నుంచి ఆయన రెండు తెలుగు రాష్ట్రాలలోనూ మంచి ప్రాక్టీస్‌ను కొనసాగిస్తున్నారు. బలమైన, సమర్థవంతమైన జీఎస్టీ అప్పిలేట్ వ్యవస్థను ఏర్పాటు చేయడం వల్ల వివాదాల పరిష్కారానికి పట్టే సమయం తగ్గడంతో పాటు, పరోక్ష పన్నుల వ్యవస్థపై నమ్మకం కూడా పెరుగుతుంది. ఒక ప్రత్యేకమైన ట్రిబ్యునల్ ఏర్పాటు చేయడం ద్వారా జీఎస్టీకి సంబంధించిన వివాదాలను మరింత వేగంగా, నైపుణ్యంతో, తక్కువ భారం కలిగించే విధంగా పరిష్కరించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఇది త్వరగా కేసుల పరిష్కారానికి, ఉన్నత న్యాయస్థానాలలో కేసుల సంఖ్య తగ్గడానికి, ఒక స్థిరమైన పన్నుల వాతావరణానికి దారితీస్తుంది. వివాదాలు సకాలంలో, నిష్పక్షపాతంగా పరిష్కరించబడతాయని వ్యాపారులకు నమ్మకం కలిగినప్పుడు, వారు మరింత ఆత్మవిశ్వాసంతో పని చేయగలుగుతారు. ఇది మొత్తం పన్నుల వ్యవస్థపై నమ్మకాన్ని పెంపొందించనుంది.

## సువేందు అధికారి కాన్వాయ్‌పై దాడి.. జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం



విశ్వంభర, ఢిల్లీ: పశ్చిమ బెంగాల్‌లో ప్రతిపక్ష నేత, బీజేపీ కీలక నేత సువేందు అధికారి కాన్వాయ్‌పై ఇటీవల జరిగిన దాడి ఘటనపై ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కూచ్ బెహర్‌లో ఆయన కాన్వాయ్‌పై టీఎంసీ గూండాలు దాడికి పాల్పడ్డారని, ఈ ఘటనను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. ఈ మేరకు ఆయన 'ఎక్స్'లో పోస్టు పెట్టారు. ఈ దాడి పోలీసుల సమక్షంలోనే జరగడం ఇంకా ఆందోళనకరమైన విషయమని పేర్కొన్నారు. ఈ ఘటన మమతా బెనర్జీ ప్రభుత్వంలో శాంతిభద్రతలు పూర్తిగా క్షీణించాయనడానికి నిదర్శనమన్నారు. ఇది కేవలం ఒక ప్రజాప్రతినిధిపై జరిగిన దాడి కాదు.. ప్రజాస్వామ్యంపైనే జరిగిన దాడిగా అభివర్ణించారు. తాను సువేందు అధికారికతో మాట్లాడి ఆయన పరిస్థితి గురించి తెలుసుకున్నట్లు పేర్కొన్నారు. బెంగాల్‌లో ఒక ప్రతిపక్ష నేతకే రక్షణ లేకపోతే.. ఇంకా సామాన్య ప్రజల దుస్థితి ఎలా ఉంటుందో ఊహించుకోవచ్చన్నారు. ఇలాంటి చట్ట వ్యతిరేక, రాజకీయ హింసాత్మక ఘటనలకు మమతా బెనర్జీ జవాబుదారీగా ఉండాలన్నారు. మరోవైపు, ఇటీవల భాజపా ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా మంగళవారం సువేందు అధికారి జిల్లా ఎస్పీకి మెమోరాండం ఇచ్చేందుకు వెళ్తుండగా అనుమానిత తృణమూల్ కాంగ్రెస్ నేతలు ఆయన కాన్వాయ్‌పై దాడికి పాల్పడ్డారు. ఆయన వాహనం ధ్వంసమైంది. మంత్రి ఉదయాన్ గుహాతో పాటు మొత్తం 41 మంది వ్యక్తులపై బీజేపీ ఫిర్యాదు చేసింది. ఇప్పటివరకు పోలీసులు కూచ్ బెహర్‌లో పలుచోట్ల ఏడుగురిని అరెస్టు చేశారు. ఈ ఘటనపై దర్యాప్తు కొనసాగుతున్నట్లు తెలిపారు.

## ఇప్పుడు ఆ అవకాశం కూడా లేకపాయే: ఖర్గే



విశ్వంభర, నేషనల్ బ్యూరో: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ మన దేశంపై సుంకాల మోత మోగించారు. ఇదంతా ప్రధాని నరేంద్రమోడీ అనుసరిస్తోన్న విదేశాంగ విధానం వైఫల్యం వల్లేనని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే దుయ్యబట్టారు. " ఈ వైఫల్యానికి కూడా 70 ఏళ్లు పాలించిన కాంగ్రెస్ పార్టీ కారణమని నిందించే అవకాశం వారికి లేకుండా పోయింది" అని ఎద్దేవా చేశారు. 1971 యుద్ధంలో పాక్‌కు మద్దతుగా అమెరికా తన సెవెంత్ ఫ్లీట్‌ను బంగాళాఖాతంలోకి పంపిన విషయం తెలిసిందే. నాడు సోవియట్ మద్దతు భారత్‌కు ఉండటంతో.. అమెరికా ఎత్తులు పారలేదు. అలాగే అణుపరీక్షల తర్వాత మన దేశంపై అమెరికా ఆంక్షలు విధించింది. దానిని తాజాగా ఖర్గే ప్రస్తావించారు. అప్పుడు భారత ప్రభుత్వం ఆత్మగౌరవంతో యూఎస్‌తో సంబంధాలను నెరిపిందన్నారు. కానీ ఇప్పుడు దౌత్యవిధానం దారుణంగా పతనమైందని ధ్వజమెత్తారు. ఇక, 50 శాతం సుంకాలు అమల్లోకి వస్తే.. భారత ఆర్థిక వ్యవస్థపై రూ. 3.75 లక్షల కోట్ల భారం పడుతుందని అంచనా వేశారు. దీనివల్ల చిన్న పరిశ్రమలు, వ్యవసాయం, ఫార్మా, వస్త్ర పరిశ్రమలు దెబ్బతింటాయని ఆందోళన వ్యక్తంచేశారు. భారత్ దిగుమతులపై ఇప్పటికే 25% సుంకాలను విధించిన ట్రంప్ .. దానిని 50 శాతానికి పెంచిన సంగతి తెలిసిందే. దీనిపై ప్రధాని మోడీ పరోక్షంగా స్పందించారు. "రైతుల ప్రయోజనాలపై ఎన్నటికీ రాజీపడే ప్రసక్తే లేదంటూ అమెరికాను ఉద్దేశిస్తూ గట్టిగా బదులిచ్చారు.

# వలస పాలన విముక్తికోసం సాగిన క్విట్ ఇండియా ఉద్యమం



## ( నేడు క్విట్ ఇండియా దినోత్సవం)

భారతదేశ స్వాతంత్ర్య పోరాటం చాలా కాలం పాటు సాగింది. దాదాపు 100 సంవత్సరాల పాటు.. బ్రిటీష్ రాజ్ సంకెళ్ల నుండి దేశానికి విముక్తి కోసం పోరాటం సాగింది.. భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో అనేక సంఘటనలు జరిగినప్పటికీ, వాటిలో అనేకం బ్రిటీష్ రాచరికాన్ని ప్రధానాంశంగా తిప్పికొట్టాయి. అందులో ఒకటి క్విట్ ఇండియా ఉద్యమం. మహాత్మాగాంధీ 1942 ఆగస్టు 8న ప్రారంభించిన చరిత్రాత్మక క్విట్ ఇండియా ఉద్యమం... 1947 ఆగస్టు 15న వలస పాలన నుంచి భారతదేశం విముక్తం కావడానికి దారితీసింది. బొంబాయి గోవాలియా టాంక్ మైదానంలో 'విజయమో, వీరస్వర్గమో...' అని గాంధీజీ ఇచ్చిన పిలుపు- దేశమంతా ఒక్కటై బ్రిటీష్ పాలనకు చరమాంకం పలకడానికి ప్రేరణగా నిలిచింది. తమను తామే పాలించుకుంటూ తమ భవిష్యత్తును తామే నిర్మించుకోవాలనే దృఢ సంకల్పం సమష్టిగా భారతీయుల్లో పాదుకుంది. అదే వారికి కొండంత ఆత్మస్థైర్యం, ఉత్సాహాలను ఇచ్చి ముందుకు నడిపింది. వలస పాలకులను దేశం నుంచి తరిమేయడానికి చోదక శక్తిగా పనిచేసింది.

### ఆంగ్లేయులు దేశాన్ని వదిలి వెళ్లాలని గాంధీజీ డిమాండ్..

రెండో ప్రపంచ యుద్ధం రూపంలో ప్రమాదం ముంచుకొచ్చింది. అది తప్పిపోవాలంటే ఆంగ్లేయులు దేశాన్ని వదిలి వెళ్లాలని గాంధీజీ డిమాండ్ చేశారు. అప్పటికే ప్రజలంతా ఆగ్రహావేశాలతో ఉన్నారు. 'విజయమో.. వీర స్వర్గమో' అంటూ మహాత్ముడు ఇచ్చిన పిలుపుతో మరింత విజృంభించారు. అప్రమత్తమైన బ్రిటీష్ ప్రభుత్వం నేతలందరినీ అరెస్టు చేసింది. అయినా జనంలో రగిలే అసంతృప్తి జ్వాలలు ఆరలేదు, అదుపులోకి రాలేదు. నిర్బంకుశ నిర్బంధాలను ధిక్కరించి, నాయకత్వం లేకపోయినా ప్రజలే సారథులై, పోరాట యోధులై పెద్ద ఎత్తున ఉద్యమించారు. క్విట్ ఇండియా నినాదం దేశమంతా మారుమోగింది. అణచివేతకు ప్రభుత్వం ప్రజలపై దమనకాండను సాగించింది. తిరగబడిన ఉద్యమకారులు సర్కారు ఆస్తులను ధ్వంసం చేశారు. యుద్ధం ఆగిపోవడంతో ఉద్యమం ఉద్ధృతి తగ్గింది. కానీ సంపూర్ణ స్వాతంత్ర్యమే భారతీయుల ఉక్కు సంకల్పమనే వాస్తవం తెల్లవారి తలకెక్కింది.

దేశ స్వాతంత్రోద్యమ చరిత్రలో క్విట్ ఇండియా ఉద్యమం జాతికి స్ఫూర్తినిచ్చిన మహోజ్వల ఘట్టం. 1942, ఆగస్టులో గాంధీ ఈ ఉద్యమానికి పిలుపునివ్వడానికి అనేక పరిస్థితులు ప్రేరేపించాయి. తక్షణం అధికార బదిలీ జరగాలనే కాంగ్రెస్ డిమాండ్‌ను బ్రిటీష్ ప్రభుత్వం నిరాకరించింది. రాజకీయ సంస్కరణల కోసం భారత నాయకులతో సంప్రదింపులు సాగించిన అనంతరం క్రిప్స్ చేసిన ప్రతిపాదనలు భారతీయులను మెప్పించలేకపోయాయి. క్రిప్స్ రాయబారం విఫలమైంది. రెండో ప్రపంచ యుద్ధ కాలంలో దేశంలో ఆహార పదార్థాల కృత్రిమ కొరత ఏర్పడింది. ధరలు ఆకాశాన్నంటాయి. కష్టకాలంలో ప్రభుత్వం వహించిన నిర్లక్ష్య ధోరణి వల్ల ప్రజాజీవితం దుర్భరంగా మారింది. మరోవైపు యుద్ధంలో అక్షరాజ్య కూటమి తరఫున జపాన్ సైన్యం ఆసియా ఖండంలో విజృంభించింది. ఆంగ్లేయులను మలయా, సింగపూర్, బర్మాల నుంచి తరిమేసి బంగాళాఖాతంలో ఆధిపత్యాన్ని ప్రదర్శించింది. జపాన్ సైన్యం భారత్ పొరుగు దేశమైన అప్పటి బర్మాలోకి ప్రవేశించింది. ఆ యుద్ధాగ్ని జ్వాలలు భారతదేశాన్నీ తాక వచ్చనే భయం ప్రజల్లో వ్యాపించింది.

### కాంగ్రెస్ వార్ధా సమావేశంలో 'క్విట్ ఇండియా' తీర్మానం ఆమోదం..

1942లో ఏర్పడిన ప్రత్యేక పరిస్థితులను, ప్రజల ఆగ్రహావేశాలను గాంధీ గ్రహించారు. భారతదేశం సురక్షితంగా ఉండాలంటే బ్రిటిషర్లు ఈ దేశాన్ని వదిలివెళ్లడం ఒక్కటే పరిష్కారమని ప్రభుత్వానికి తన 'హరిజన' పత్రిక ద్వారా సూచించారు. కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ 1942, జులై 14న వార్ధాలో సమావేశమై ఈ విషయాన్ని సుదీర్ఘంగా చర్చించి 'క్విట్ ఇండియా' తీర్మానాన్ని ఆమోదించింది. అఖిల భారత కాంగ్రెస్ కమిటీ ఆగస్టు 8న బొంబాయిలో సమావేశమై ఆ తీర్మానాన్ని ధ్రువీకరించింది. అహింసాయుతంగా, గాంధీ నాయకత్వంలో పోరాడాల్సిందిగా ఈ తీర్మానం ప్రజలకు విజ్ఞప్తి చేసింది. ఒకవేళ ప్రభుత్వం దమననీతికి పాల్పడి ఉద్యమ నాయకులను అరెస్ట్ చేస్తే, స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను ప్రగాఢంగా కోరుకునే ప్రతి భారతీయుడు ఉద్యమస్ఫూర్తితో స్వయంగా కార్యక్రమం రూపొందించుకోవాలని కోరింది.

బొంబాయిలోని గోవలియ ట్యాంక్ మైదానంలో (క్రాంతి మైదానం) ఆగస్టు 8న గాంధీజీ ఉపన్యసిస్తూ స్వాతంత్ర్యానికి తక్కువైంది ఏదీ అంగీకరించడం కుదరదని స్పష్టం చేశారు. దానికోసం ఒక మంత్రం ఉపదేశించారు. అదే 'విజయమో.. వీరస్వర్గమో' (డూ ఆర్ డై), దేశాన్ని విముక్తి చేయడమో లేదా ఆ ప్రయత్నంలో మరణించడమో ఏదో ఒకటి జరగాలని ఉద్వేగంగా ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రజలంతా స్వతంత్ర భారత పౌరులుగా జీవించాలని, బ్రిటిష్ ప్రభుత్వ ఆజ్ఞలను అహింసాయుతంగా ధిక్కరించాలని చెప్పారు. అయితే ఈ ఉద్యమ నిర్వహణ కార్యక్రమాన్ని కాంగ్రెస్ అప్పటికి ఇంకా ఖరారు చేయలేదు. క్విట్ ఇండియా ఉద్యమానికి ఫార్వర్డ్ బ్లాక్, జయప్రకాష్ నారాయణ్, అచ్యుత్ పట్వార్ధన్, రామ్ మనోహర్ లోహియా మొదలైనవారు స్థాపించిన కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ వంటి రాజకీయ పార్టీలు మద్దతిచ్చాయి. ఇండియన్ ముస్లింలీగ్, కమ్యూనిస్ట్ పార్టీ ఉద్యమంలో పాల్గొనలేదు. తర్వాత ముస్లింలీగ్ 'డివైడ్ అండ్ క్విట్' అని డిమాండ్ చేసింది.

### కాంగ్రెస్‌ను నిషేధించిన ప్రభుత్వం...

బొంబాయిలో కాంగ్రెస్ క్విట్ ఇండియా తీర్మానం చేసిన వెంటనే ప్రభుత్వం కాంగ్రెస్‌ని నిషేధించింది. అదే రోజు రాత్రి దేశవ్యాప్తంగా కాంగ్రెస్ నాయకులపై విరుచుకుపడి 24 గంటల్లోనే దాదాపుగా అందరినీ నిర్బంధించింది. గాంధీజీతో పాటు కస్తూరిబా గాంధీని అరెస్ట్ చేసి పూనాలోని ఆగాఖాన్ ప్యాలెస్‌లో నిర్బంధించారు. జవహర్‌లాల్ నెహ్రూ, మౌలానా ఆజాద్, పట్టాభి సీతారామయ్య, ఆచార్య కృపలానీ మొదలైనవారు అహ్మద్‌నగర్ కోటలో బందీలయ్యారు. డాక్టర్ రాజేంద్రప్రసాద్ పట్నాలో అరెస్టయ్యారు.

1942, ఆగస్టు 9 నాటికి దాదాపు నాయకులంతా అరెస్టయ్యారు. అప్పటికే బ్రిటిషర్ల నిరంకుశ, అణచివేత విధానాలతో ప్రజలు తీవ్ర ఆగ్రహావేశాలతో ఉన్నారు. నిక్షిప్తంగా ఉన్న అసంతృప్తి జ్వాలలు ఒక్కసారిగా భగ్గుమన్నాయి. ఉద్యమ నాయకులను ప్రభుత్వం నిర్బంధించినా, ప్రజలే ఉద్యమాన్ని నిర్వహించారు. అందుకే క్విట్ ఇండియా గొప్ప ప్రజా ఉద్యమంగా మారింది. అయితే ప్రజల ముందు ఒక స్పష్టమైన అజెండా లేదు. గాంధీ జైలులో నిర్బంధంలో ఉండటంతో ఎలాంటి మార్గదర్శకత్వం చేయలేకపోయారు. తొలి దశలో చాలాచోట్ల నిరసనలు, హర్తాళ్లు, శాంతియుత సమావేశాలు నిర్వహించారు. ఢిల్లీ, బొంబాయి, కాన్పూర్, లఖ్‌నవూ, నాగ్‌పుర్, బెంగళూరు, మద్రాసు, అహ్మదాబాద్ లాంటి ప్రముఖ నగరాలు, పట్టణాల్లో మహిళలు, విద్యార్థులు, కార్మికులు, మధ్యతరగతి వారు, చేతివృత్తులవారు క్విట్ ఇండియా నినాదంతో నిరసన ప్రదర్శనలు చేశారు. పోలీసులతో, సైన్యంతో ఘర్షణకు దిగారు. ఉద్యమానికి బొంబాయి కేంద్రంగా మారింది. దేశంలో అతిపెద్ద పారిశ్రామిక సంస్థ అయిన టాటా ఉక్కు కార్మికులు జాతీయ ప్రభుత్వం ఏర్పడే వరకు విధుల్లో చేరేది లేదంటూ సమ్మె చేశారు. ప్రజాజీవనం స్తంభించింది. క్విట్ ఇండియా ఒక్కటే ఉద్యమకారులందరి డిమాండ్‌గా మారింది.

### ఈ ప్రజా ఉద్యమాన్ని బలప్రయోగంతో అణచివేయాలని..

ప్రభుత్వం ఈ ప్రజా ఉద్యమాన్ని బలప్రయోగంతో అణచివేయాలని నిశ్చయించింది. అరెస్టులు, జరిమానాలు, ప్రజల వ్యక్తిగత ఆస్తిని స్వాధీనం చేసుకోవడం, లాఠీఛార్జీలు, నిరాయుధులపై కాల్పులు జరపడం ఈ ఉద్యమకాలంలో నిత్యకృత్యమయ్యాయి. ప్రభుత్వ దమనకాండ ప్రజల ఆగ్రహావేశాలకు మరింత ఆజ్యం పోసినట్లయింది. హింసకు ప్రతిహింసను సృష్టించింది. ఉద్యమం గ్రామీణ ప్రాంతాలకు పాకింది. విద్యార్థులు విద్యాసంస్థలను బహిష్కరించారు. కార్మికులు, స్త్రీలు, చేతివృత్తులవారు రోడ్డుపైకి వచ్చి ఉద్యమాన్ని తీవ్రతరం చేశారు. ప్రభుత్వ ఆస్తులు వారి లక్ష్యమయ్యాయి. టెలిగ్రాఫ్ లైన్‌లు తెగిపడ్డాయి. రైల్వే లైన్‌లు ధ్వంసమయ్యాయి. పోస్టాఫీసులు, ప్రభుత్వ కార్యాలయాలు తగలబడ్డాయి. ఉద్యమకారులకు కాంగ్రెస్ సోషలిస్ట్ పార్టీ నాయకులు అరుణా అసఫ్ అలీ, అచ్యుత్ పట్వార్ధన్, జయప్రకాశ్ నారాయణ్ తదితరులు తెరచాటు సహాయం అందించారు. విప్లవభావాలతో ఉన్న నాయకులు మిద్నపూర్‌లోని తామ్రలుక్, మహారాష్ట్రలోని సతారా, ఒరిస్సాలోని తాల్చేరు లాంటి చోట్ల రహస్య పోటీ ప్రభుత్వాలను ఏర్పాటు చేశారు. ఉద్యమం ప్రారంభమైన మూడు నెలల్లో బ్రిటీష్ ప్రభుత్వం క్రూర విధానాలతో అణగదొక్కింది. యథావిధిగా సమాజంలోని ఉన్నత వర్గాలు, అధికార గణం ప్రభుత్వానికి విధేయులుగా మిగిలారు. ప్రభుత్వ హింసాకాండ తారస్థాయికి చేరింది. అధికారిక లెక్కల ప్రకారం 10 వేల మందికి పైగా కాల్పుల్లో మరణించగా, 60 వేలకు పైగా అరెస్టయ్యారు. ఈ ఉద్యమంలో జరిగిన హింసాత్మక సంఘటనలకు ప్రభుత్వం గాంధీని నిందించింది. దీంతో ఆయన తన ఆత్మశుద్ధికి 21 రోజులు నిరాహార దీక్ష చేశారు. తర్వాత గాంధీజీ నిర్బంధం నుంచి విడుదలయ్యారు. యుద్ధంలో మిత్ర రాజ్యాల విజయం వల్ల ఉద్యమం ఉద్ధృతి తగ్గింది. క్విట్ ఇండియా ఉద్యమానికి మూలకారణమైన రెండో ప్రపంచ యుద్ధం, దాని ప్రధాన కారకుడైన హిట్లర్ ఆత్మహత్య చేసుకోవడంతో పరిసమాప్తమైంది.

ఉద్యమ ప్రారంభంలోనే ప్రముఖ నాయకులంతా అరెస్ట్ అయినప్పటికీ ప్రజలే ఉద్యమానికి నాయకత్వం వహించి దేశం కోసం ఎంతటి త్యాగాలకైనా సిద్ధమేనని ప్రభుత్వానికి చాటారు. ఈ మహా ప్రజాఉద్యమాన్ని ప్రభుత్వం నిరంకుశ విధానాలతో అణచివేసినప్పటికీ, ప్రజల్లో గొప్ప రాజకీయ చైతన్యాన్ని కలిగించింది. కాంగ్రెస్ విధానాల పట్ల ప్రజల్లో మళ్లీ విశ్వాసం ఏర్పడింది. చిరకాలంగా ప్రభుత్వ ఎజెండాగా ఉన్న 'డొమినియన్ ప్రతిపత్తి' ఆగస్టు ఉద్యమంలో ఆహుతైంది. ప్రజల నినాదమైన సంపూర్ణ స్వాతంత్ర్యం తప్ప మరేదీ అంగీకారం కాదని ప్రభుత్వానికి స్పష్టమైంది. ఉవ్వెత్తున ఎగసిన తిరుగుబాటు పాలకుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసింది. స్వాతంత్ర్యాన్ని భారతదేశ గుమ్మంలోకి తీసుకొచ్చింది.

### మూడు దశలుగా సాగిన ఉద్యమం..

క్విట్ ఇండియా ఉద్యమం మూడు దశలుగా జరిగింది. మొదటి దశలో పట్టణాల్లో తిరుగుబాటు, సమ్మెలు, బహిష్కరణలు జరిగాయి. రెండవ దశలో ప్రధాన రైతు తిరుగుబాటు జరిగింది. ఇది రైల్వే ట్రాక్‌లు, స్టేషన్‌లు, టెలిగ్రాఫ్ వైర్లు, స్తంభాలు, ప్రభుత్వ భవనాలు వంటి బ్రిటీష్ రాజ్ సంబంధించి కనిపించే చిహ్నాలను నాశనం చేయడం ద్వారా బ్రిటీషర్ల వెన్నులో వణుకు పుట్టించింది. భారతదేశానికి డొమినియన్ హోదాను అందించిన క్రిప్స్ మిషన్ వైఫల్యం ఉద్యమం వెనుక ప్రధాన అంశం. విస్తృతమైన బ్రిటీష్ వ్యతిరేక సెంటిమెంట్, సంపూర్ణ స్వాతంత్ర్యం కోసం పెరుగుతున్న ప్రజా మద్దతు కారణంగా.. క్విట్ ఇండియా ఉద్యమం విజయవంతమైంది. అనేక చిన్న ఉద్యమాలు. మిలిటెంట్ ఆవిర్భావాలు ఉద్యమంతో జతకట్టాయి. మహాత్మా గాంధీ, అబ్దుల్ కలాం ఆజాద్, జవహర్‌లాల్ నెహ్రూ, సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ వంటి భారత జాతీయ కాంగ్రెస్‌లోని పలువురు సీనియర్ నాయకులను బ్రిటీష్ వారు వెంటనే అరెస్టు చేశారంటే ప్రజా మద్దతుతో ఉద్యమం ఎంత మహోద్యమంగా మారిందో అంచనా వేయొచ్చు. క్విట్ ఇండియా ఉద్యమం ప్రజలతో ప్రతిధ్వనించినప్పటికీ.. బ్రిటిష్ వారు భారతదేశానికి తక్షణ స్వాతంత్ర్యం ఇవ్వడానికి నిరాకరించారు. రెండవ ప్రపంచ యుద్ధం ముగిసిన తర్వాత మాత్రమే మీ దేశం నుంచి వెళ్లిపోతామని తెలిపారు. మనం భారత్ ను వదిలివెళ్లాల్సిన సమయం వచ్చిందని బ్రిటీష్ వారికి క్లారిటీ వచ్చేలా చేసిన ఉద్యమంగా క్విట్ ఇండియా నిలుస్తుంది. క్విట్ ఇండియా ఉద్యమం యొక్క ప్రాముఖ్యతను గుర్తించడానికి ప్రతీయేటా ఆగస్టు 9న క్రాంతి దివస్ జరుపుకుంటారు.

**-పి.వెంకటరమణగుప్త**

# బీసీ రిజర్వేషన్లపై రేవంత్ రెడ్డి పట్టు...



తెలంగాణ రాజకీయాల్లో బీసీ రిజర్వేషన్ల అంశం బీసీలను స్థానిక రిజర్వేషన్లు అంశం తో బీసీ ఉద్యమా నికి గట్టి పునాదులు పడుతున్నాయి. బీసీ ల సంఘ టిత ఉద్యమం తో పాటు, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీసుకుంటున్న భిన్నమైన ఆలోచన, బీసీ హక్కులపై చూపిస్తున్న దృఢమైన సం కల్పం, కార్యశీలత యావత్ దృష్టిని ఆకర్షిస్తున్నది. ఆయన పాలనలో బీసీలకు న్యాయం జరిగేలా తీసుకుంటున్న చర్యలు, రేవంత్ రెడ్డి ఇమేజ్‌ను అమాంతం పెంచాయి.

### బీసీలకు న్యాయం చేసే దిశగా రేవంత్ వినూత్న పోకడ..

రేవంత్ రెడ్డి పదవిలోకి వచ్చిన తర్వాత బీసీలకు ప్రాధాన్యత ఇస్తున్న తీరే ఆయన దృక్పథాన్ని ప్రతిబింబిస్తోంది.

ఆయన తక్షణమే బీసీ కమిషన్‌ను బలోపేతం చేయడం, దాని పరిధిని విస్తరించడం, బీసీల సామాజిక, ఆర్థిక స్థితిగతులపై పరిశీలన చేపట్టడం ఈ విషయంలో కీలక అడుగులు.

రేవంత్ రెడ్డి ముఖ్యంగా శాసనసభలో, కేబినెట్‌లో బీసీ ప్రతినిధిత్వాన్ని పెంచే ప్రయత్నాల్లో ఉన్నారు. పదవులలో బీసీలకు సరైన వాటా ఉండాలన్న ఆలోచనతో ఆయా నియామకాల్లో సమతుల్యతను కృషి చేస్తున్నారు. ప్రస్తుతం నియమితమైన కొంతమంది ముఖ్యమైన బీసీ నేతలు ఆయన ప్రభుత్వం వైపు విశ్వాసాన్ని పెంచుతున్నారు.

బీసీలను సాధికారత వైపు నడిపించాలంటే వారి యథార్థ పరిస్థితిని అర్థం చేసుకోవాల్సిన అవసరం ఉంది. ఈ దిశగా రేవంత్ రెడ్డి తీసుకున్న కీలక నిర్ణయం బీసీ జనగణన చేపట్టే ప్రణాళిక. ఇది నిజంగా అమలైతే, బీసీలలో ఉపవర్గాలకు ఎలాంటి అవకాశాలు లభిస్తున్నాయి, ఏ వర్గాలు తక్కువగా ప్రయోజనం పొందుతున్నాయి అనే విషయంలో స్పష్టత వస్తుంది. బీసీ వర్గీకరణ అంటేనే రాజకీయంగా క్లిష్టమైన అంశం. అయితే బీసీ 'ఎ', 'బి', 'సి', 'డి' వర్గీకరణలో సమానంగా అవకాశాలు కల్పించాలన్న దృక్పథాన్ని రేవంత్ బహిరంగంగా ప్రస్తావించడంతో పాటు, అవసరమైతే చట్టసభల ద్వారా సంస్కరణలు తీసుకురావాలని కూడా సంకేతాలు ఇస్తున్నారు.

రాజకీయాల నుంచి బీసీలను కేవలం ఓటర్లగానే కాక, నాయకత్వంలోనూ చేర్చే దిశగా ఆయన ప్రయత్నిస్తున్నరు. పలు నియోజకవర్గాల్లో బీసీ అభ్యర్థులను ప్రోత్సహించడం, పార్టీలో వారికి కీలక బాధ్యతలు అప్పగించడం, తాను బీసీ వర్గాల్లో ఉన్న సమస్యలను నేరుగా తెలుసుకునేందుకు పర్యటనలు చేయడం ఈ దిశగా చూపుతున్న శ్రద్ధ ఆయనలోని దృఢ సంకల్పాన్ని తెలియజేస్తుంది. బీసీ రిజర్వేషన్ల అంశంలో రేవంత్ రెడ్డి తీసుకుంటున్న విధానం ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఉంది. సాధికారత, సమానత్వం అనే భావనలకు నిజమైన రూపం ఇవ్వాలంటే, బీసీలకు కేవలం రిజర్వేషన్లు కాదు, పరిపాలనా శక్తి కూడా ఇవ్వాలి. ఈ నేపథ్యంలో రేవంత్ ముందడుగు వేసిన పద్ధతి, బీసీ హక్కుల పరిరక్షణలో ప్రధాన పాత్ర పోషించే అవకాశం కలిగి ఉంది. కాంగ్రెస్ అగ్ర నేత రాహుల్ గాంధీ ఆలోచనలఅనుగుణంగా పాలన సాగేందుకు రేవంత్ కృచేయడమే కాదు. రాహుల్ సిద్ధాంతానికి తెలంగాణ వేదిక కానుంది. గత పది సంవత్సరాల కేసీర్ పాలనలో సామాజిక విధ్వం సానికి గురై న అణగారిన కులాల సాధికరతకు తెలంగాణకు రేవంత్ ప్రజా పాలనలో మహర్దశ పట్టనుం ది. సామాజిక తెలంగాణ కు తెలంగాణ రాష్ట్రం వేదిక కానుంది.



**- దొమ్మాట వెంకటేష్**
**ఫ్రీలాన్స్ జర్నలిస్ట్**

# ఇది ఏమి "చిత్రమో"




వేతనాలను 30 శాతం పెంచాలంటూ సినీ కార్మికులు కొన్ని రోజులుగా చేస్తున్న ఆందోళన, ప్రతిగా కొందరు సినీ రంగ ప్రముఖులు, నిర్మాతలు చేస్తున్న ప్రకటనలు చూస్తే ఎవరిది న్యాయం? అనే చర్చ సహజంగానే ఉద్భవిస్తున్నది. వేతనాలు పెంచాలన్న సినీ కార్మికుల డిమాండ్ సహజమైనది, న్యాయమైనది. రెండు గంటలు లేదా రెండున్నర గంటల పాటు థియేటర్లో ప్రదర్శించబడే ఆ సినిమా రూపకల్పన వెనుక వేలాది మంది సినీ కార్మికుల శ్రమ దాగి ఉందన్నది నిజం. ఆ సినిమా కూడా కొద్దిరోజుల్లో పూర్తవుతుందని నమ్మకం లేదు. చాలా సినిమాలు నెలల తరబడి, సంవత్సరాల తరబడి రూపొందుతూనే ఉంటాయి. చివరికి బాక్స్ ఆఫీస్ నుంచి ప్రదర్శనకు వెళ్తాయి. ఇక్కడే లాభనష్టాల గొడవ ప్రారంభమవుతుంది. చివరికి ఎంత రాబడి ఆర్జించింది? ఎంత లాభం వచ్చింది? ఈ వసూళ్లలో రికార్డులు ఎన్ని? ఏ ఏ స్థాయిలో రికార్డులను అధిగమించాము? రాష్ట్రస్థాయి? తెలుగు రాష్ట్రాల స్థాయి? టాలీవుడ్? బాలీవుడ్? ఇంకేదో అంతర్జాతీయ స్థాయి సంస్థలు, వేదికల పేరిట సాధించే రికార్డులపై చర్చలు జరుగుతుంటాయి. చివరికి ఒక హీరో... కాదు కాదు నటుడు, ఒక హీరోయిన్... కాదు నటి లేదా నాయక(ప్రస్తుతము హీరో, హీరోయిన్గా పేర్కొనే పాత్రలను ఇకనుంచి నటుడు, నటి అని పరిమితం చేయడం మేలు అన్నది నా భావన) వీళ్లైతే దర్శకుడు... వీరికి ఆ సినిమా ద్వారా ఎంత అందించారు? అనేది కూడా రికార్డులుగానే చెప్పు కుంటుంటారు. ఇందులో తప్పులేదు, తప్పు అసలే కాదు... తెలుగు సినిమా రంగాన్ని అంతర్జాతీయ ఖ్యాతి స్థాయికి తీసుకు వెళ్తున్న అందరినీ అభినందించవలసినదే. కానీ, ఆ సినిమా తెరవనుక ఎందరి కృషి ఉన్నది? ఎవరెవరు ఏ స్థాయిలో పని చేశారు? అని మాత్రం ఎవ్వరూ చర్చించుకోరు. ఎంతసేపు నటుడు, నటి, దర్శకుడు, నిర్మాత చుట్టూనే సినీ రాజకీయాలు తిరుగుతుంటాయి. పేరు ప్రఖ్యాతులు కూడా వీరికే దక్కుతుంటాయి. ఆ సినిమా రూపొందించడంలో తమ శ్రమను ధారపోసిన సినీ కార్మికుల గూర్చి మాత్రం ఎవరూ పట్టించుకోరు. రోజువారి కూలీలుగా కొందరు? నెలవారి వేతనాలతో కొందరు? లేదా ఒక సన్నివేశానికి కొంత మొత్తం పేరిట కొందరు? ఇలా ఈ రంగంలోని వివిధ వ్యవస్థలలో పనిచేసే వేలాది కార్మికుల జీవితాలలో మాత్రం ఎటువంటి పురోగతి ఉండదు. 30 శాతం వేతనాలు పెంచాలన్న సినీ కార్మికుల డిమాండ్ పై రోజుల తరబడి నాన్చివేత ధోరణిని అవలంపిస్తున్న సినీ నిర్మాతలు, ఆ రంగానికి చెందిన ప్రముఖుల తీరును విధిగా ప్రశ్నించాల్సిందే. 30 శాతం వేతనాలు పెంచితే... చిన్న నిర్మాతలు సమస్యలు ఎదుర్కొంటారట? సినీ కార్మికుల వేతనాలు సాఫ్ట్ వేర్ ఉద్యోగులకు మించి ఉన్నాయి? ఇక్కడి కార్మికులలో ప్రతిభ లేదు? ప్రతిభ, సామర్థ్యం ఉన్న సినీ కార్మికులను ఇతర ప్రాంతాల నుంచి తీసుకు వచ్చి సినిమాలు నిర్మిస్తాం? ఇలా ఒకటేమిటి? మన సినీ రంగ ప్రముఖులు కొందరు తామే ఈ రంగాన్ని ఉద్ధరిస్తున్నామని, తమ వల్లనే ఈ రాష్ట్రం లేదా దేశం భవిష్యత్తు మారుతుందనన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. రోజుల తరబడిగా ఆందోళన చేస్తున్న సినీ కార్మికులతో చర్చలు జరపడంలో కూడా ఆ రంగ పెద్దలు ఇప్పటికైతే విఫలమయ్యారు. సినీ రంగంలో అగ్ర శ్రేణి వారిగా పేరుందుతున్న వారి వద్దకు వెళ్లి సమస్యను పరిష్కరించుకునే దిశగా ఒక అడుగు పడినట్లుగా కనిపిస్తున్నది. కనీసం ఆ స్థాయిలోనైనా కార్మికులకు న్యాయం జరిగితే మంచిది. తెలుగు సినీ రంగం ప్రఖ్యాతి అంతర్జాతీయ స్థాయికి వెళ్లిందన్నది అందరూ అంగీకరించాల్సిందే. బహుశా, దేశంలోని మరే ఇతర భాషలలోని అగ్రస్థాయి నటులు కూడా పొందని స్థాయిలో తెలుగు సినీ రంగానికి చెందిన నటులు, నటీమణులు రూ.100 కోట్లు, రూ. వందల కోట్లలో పారితోషికాలు పొందుతున్నారు. నటుడు, నటి స్థాయిలో కాకపోయినా... దర్శకులకు కూడా గౌరవప్రదంగానే పారితోషికం అందుతుంది. ఇక నిర్మాతలు ఆర్జిస్తున్నది... ఏ స్థాయిలో ఉంటుందో తరచూ చూస్తూనే ఉంటున్నాం. ఇక్కడ సమస్య కేవలం సినీ రంగ వేతన జీవులది, రోజువారి కూలీలది. ఈ రోజైనా ఉపాధి దొరుకుతుందా? అని అడ్డాపై నిత్యం ఆశగా ఎదురుచూసే వందలాదిమంది సినీ కార్మికుల జీవన బాధలు, గాథలు కన్నీటిని తెప్పిస్తుంటాయి. ఈ వేతన జీవులకు 30 శాతం వేతనాలు పెంచేందుకు... వందల కోట్ల లాభాలను ఆర్జించే నిర్మాతలకు మాత్రం మనసు ఒప్పడం లేదు. పైగా అభియోగాలు. ఈ కార్మికుల కృషి లేకుండానే తెలుగు చలనచిత్ర రంగం అంతర్జాతీయ ఖ్యాతిని ఆర్జించిందా? అన్నది ప్రశ్నించుకోవాలి.

దేశము, సమాజమును తామే ఉద్ధరిస్తున్నట్లుగా భావించుకునే కొందరు ఈ సినీ రంగ పెద్దలు నిర్మిస్తున్న సినిమాల గురించి ఎంత తక్కువ చర్చించుకుంటే అంత మంచిది. ఎటువంటి సినిమాలు నిర్మించాల్సిన అవసరం ఉన్నది? ప్రస్తుతం నిర్మితమవుతున్న చిత్రాలు ఎటువంటివి? వీటిని బేరీజు వేసుకుంటే... సమాజాన్ని ప్రభావితం చేస్తూ... ప్రజలను ముఖ్యంగా యువతను ఏ స్థాయిలో పెడదారి పట్టిస్తున్నారు? అన్నది విడమర్చి చెప్పుకోవాల్సిన అవసరం లేదు. సందేశాత్మక చిత్రం అన్నది... ఇకనుంచి మ్యూజియంలో వెతుక్కోవాలేమో?. ఎవరో ఒకరు సందేశాత్మక సినిమాలు నిర్మించే ప్రయత్నం చేసినా ఆ సినిమాలు ఆడేందుకు థియేటర్లు కూడా అందకుండా చేసే స్థాయిలో సినీ మాఫియా ఎదిగింది. తాము సినిమాలు విడుదల చేసే సమయానికి థియేటర్లు అందుబాటులో లేకుండా చేస్తున్నారంటూ అనేక సందర్భాల్లో సందేశాత్మక చిత్రాలు నిర్మించే నిర్మాతలు కొందరు ఆవేదన వ్యక్తం చేసిన విషయం తెలిసిందే. సందేశాత్మక చిత్రాల సంగతి పక్కన పెడితే... సమాజాన్ని పెడదోవ పట్టించే చిత్రాలను నిర్మించి... అదే చాలా గొప్పది అన్నట్లుగా ఫోజులిస్తున్న సంఘటనలు కూడా చూస్తూనే ఉన్నాం. కొన్ని నెలల క్రితం ఒక సినిమా విషయంలో జరిగిన రచ్చ ఇందుకు ప్రత్యక్ష ఉదాహరణ. ఆ సంఘటన సమయంలో అనేకమంది అనేక రూపాల్లో ప్రతిస్పందించారు. సినీ రంగంపై వేలాది, లక్షలాది కుటుంబాలు ఆధారపడి ఉన్నాయని... సినిమాలపై విమర్శలు చేయవద్దని, ఈ రంగాన్ని కాపాడుకునేలా వ్యవహరించాలని కూడా కొందరు అప్పట్లో సూచిం చారు. మరి ఇప్పుడు ఏమైంది?. సినీ కార్మికులు వేతనాలు పెంచాలని డిమాండ్ చేస్తే... ఎందుకు వారిపై విమర్శలు చేస్తున్నట్లు? ఆ సమస్య పరిష్కారం పై... ఎందుకు జాప్యం చేస్తున్నట్లు? ప్రశ్నించు కోవాల్సి ఉంటుంది. ఎటువంటి చిత్రాలు నిర్మితమవుతున్నాయి అన్నది పక్కన పెడితే... ఆ చిత్రాల రూపకల్పనకు తమ శ్రమను ధారబోస్తున్న సినీ కార్మికుల వేతనాలు పెంచాల్సిందే.. పెంచి తీరాల్సిందే.



**బాశెట్టి శ్రావణ్ కుమార్**
**సీనియర్ జర్నలిస్ట్. - 7207201154**

# సినిమా అంటే.. ఆ "నలుగురే"నా?



**"నలుగురు' హీరోలు, నిర్మాతలు మాత్రమేనా? నాలుగైదు కుటుంబాలు మాత్రమేనా? వారికి సంబంధించిన వ్యాపారం మాత్రమేనా? కేవలం వ్యాపారమేనా? ఇంకేమీ లేదా? దానికి సామాజిక బాధ్యత అసలు లేదా? వినోదంతో పాటు విజ్ఞానాన్ని సమాజానికి అందించవలసిన కర్తవ్యం అది మరిచిపోయిందా?**

ప్రేక్షకులకు ఏమీ సంబంధం లేదా? నిజానికి సినిమా పోషకులు ఎవరు? ప్రేక్షకులు కదా. వారే కదా థియేటర్లో టికెట్లు కొనుక్కొని పరిశ్రమను పోషించేది. వారి డబ్బుతోనే కదా కథానాయకులు, నాయి కలు, నిర్మాతల విందు, వినోద, విలాసాది సోకులు. వీటినన్నిటిని అందిస్తున్నది ప్రేక్షకులేనని మరచిపోవడం సబబేనా? భావ్యమేనా? అది వారికి గుర్తుకు రావడం లేదా? మరి ప్రేక్షకుల/పోషకుల కోణంలో సినిమా పరిశ్రమ ఆలోచించడం లేదెందుకు? లాభాలు నష్టాలు అని మాత్రమే మాట్లాడుతున్నదేమిటి?

తాము ఏ సినిమా నిర్మించినా అది ఏ సందేశమూ ఇవ్వకపోయినా, హింసను ప్రేరేపించినా, అశ్లీలతను పెంచి పోషించినా ప్రేక్షకులు చచ్చుకుంటూ చూస్తారు! అంతా మా ఇష్టం! ప్రేక్షకులకు గత్యంతరం లేదు. అనే ధోరణిని ఆ "నలుగురు" వ్యక్తం చేస్తున్నారు. సినిమా టికెట్లపై ఆంధ్రప్రదేశ్ లో తలెత్తిన వివాదం ఈ ప్రశ్నలను లేవనెత్తుతున్న ది. సినిమా నిర్మాతలు తామే కాబట్టి టికెట్ల ధరలను తామే నిర్ణయిస్తామని ఓ ప్రబుద్ధుడు వాదిస్తున్నాడు. తామే సినిమాను నిర్మిస్తున్నాం కాబట్టి అంతా తమ ఇష్ట ప్రకారమే నడవాలని, ప్రభుత్వ జోక్యం అనవసరం అనే వాదన ఈ "నలుగురు" చేస్తున్నారు. నిర్మాణ వ్యయం ఎంత? హీరో హీరోయిన్ ల పారితోషికాలు ఎంత? అనే సంగతులు ఏ మేరకు పారదర్శకంగా ఉన్నాయి? వ్యవస్థకు ఆ "నలుగురు" చెల్లిస్తున్నది ఎంత? దొంగచాటుగా పుచ్చుకుంటున్నది ఎంత? వీటిపై మెయిన్ స్ట్రీమ్/ప్రధాన స్రవంతి మీడియా చర్చించడం లేదెందుకు? నాలుగైదు కుటుంబాల చేతుల్లో బందీ అయిపోయిన సినిమా పరిశ్రమ అసలు రంగును ప్రపంచానికి తెలియజెప్పవలసిన బాధ్యతను ఎందుకు విస్మరించింది? మొక్కుబడిగా ఓ నిర్మాత, ఓ థియేటర్ యజమానితో చర్చ జరిపితే వివాదం ఎమిటో? ఎందుకు తలెత్తిందో? కారణం ఎవరు? ఏమిటి? అనే సంగతులు ప్రేక్షకులకు అర్థమవుతాయా? అది సమగ్ర చర్చ అనిపించుకుంటుందా? చర్చను ఈ "నలుగురి" కోణంలోనే నడిపిస్తున్న కారణం ఏమిటి? మీడియా వీక్షకులు, పోషకులు కూడా ప్రజలు, ప్రేక్షకులే కదా. మీడియా కూడా ఆ అసలు సంగతిని పక్కన బెట్టడం ఏమిటి? ప్రేక్షకుల కోణంలో చర్చను నడపడం లేదెందుకు?



**గందె గోవర్ధన్**

# ఆసియా కప్ నుంచి తప్పుకున్న పాకిస్థాన్?




పహల్గామ్‌లో జరిగిన ఉగ్రదాడి తర్వాత భారత్, పాకిస్థాన్‌ల మధ్య శత్రుత్వం ఇంకా పెరిగిపోయింది. ఈ నేపథ్యంలో పాక్‌తో ఏ స్థాయిలో కూడా ఆటల్లో పాల్గొనట్లేదని భారత్ చెబుతోంది. అయితే తాజాగా పాకిస్థాన్ ఓ కీలక నిర్ణయం తీసుకుంది. ఆసియా కప్ నుంచి పాకిస్థాన్ తప్పుకుంది. అది క్రికెట్ కాదు.. హాకీ టోర్నమెంట్. ఆసియా కప్ హాకీ టోర్నమెంట్-2025 నుంచి పాకిస్థాన్ తప్పుకుంటుందని వార్తలు వస్తున్నాయి. ఈ ఈవెంట్ బిహార్‌లోని రాజ్‌గిర్‌లో ఆగస్టు 27 నుంచి సెప్టెంబర్ 7 వరకూ జరగనుంది. ఇందులో భద్రతా కారణాలను చూపిస్తూ.. పాకిస్థాన్ హాకీ ఫెడరేషన్ ఈ టోర్నమెంట్ నుంచి తప్పుకోవాలని భావిస్తున్నట్లు సమాచారం.అయితే ఈ టోర్నమెంట్‌లో పాల్గొనేందుకు పాకిస్థాన్ జట్టు తొలుత వీసాలకు ధరఖాస్తు చేసింది. భారత ప్రభుత్వం కూడా పాక్ ఆటగాళ్ల వీసాలు ఆమోదించడానికి సిద్ధంగా ఉన్నట్లు తెలుస్తోంది. అయితే ఈ లోపే పాకిస్థాన్ ఈ నిర్ణయం తీసుకుందట. "పిహెచ్ఎఫ్ బుధవారం ఆసియా హాకీ సమాఖ్యకు ఒక లేఖ రాసింది. భద్రతా కారణాల దృష్ట్యా ఆసియా కప్‌లో పాల్గొనడం లేదని అందులో పేర్కొంది. బంగ్లాదేశ్ జట్టును తమ దేశంలో ఆడేందుకు ఆహ్వానించింది" అని హాకీ ఇండియా అధికారి ఒకరు వెల్లడించారు. అయితే దీనిపై ఎలాంటి అధికారిక ప్రకటన రాలేదు.

### ఐసిసి ర్యాంకుల్లో

# శుభ్‌మాన్‌కి షాక్.. అన్ని పరుగులు చేసినా..




భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెండూల్కర్-ఆండర్సన్ ట్రోఫీలో టీం ఇండియా కెప్టెన్ శుభ్‌మాన్ గిల్ అద్భుతంగా రాణించాడు. కెప్టెన్‌గా బాధ్యతలు తీసుకొన్న తొలి సిరీస్‌లోనే జట్టును ముందుండి నడిపించాడు. బ్యాటింగ్‌తో కూడా అతడు చెలరేగిపోయాడు. ఇంగ్లండ్ బౌలర్లను ధీటుగా ఎదురుకుంటూ సిరీస్‌లోనే అత్యధిక పరుగులు చేసిన ఆటగాడిగా నిలిచాడు. అయితే సిరీస్ ముగిసిన రెండు రోజులకే ఐసిసి ర్యాంకులను ప్రకటించింది. ఇందులో శుభ్‌మాన్ గిల్‌కు షాక్ తగిలింది. తాజాగా ప్రకటించిన ఐసిసి ర్యాంకుల్లో గిల్ నాలుగో స్థానాలు కోల్పోయాడు. అందుకు కారణం లేకపోలేదు.ఒకే సిరీస్‌లో అత్యధిక పరుగులు చేసిన రెండో కెప్టెన్‌గా గిల్ రికార్డు సృష్టించాడు. ఇంగ్లండపై ఈ సిరీస్‌లో ఐదు టెస్టుల్లో ఏకంగా 754 పరుగులు చేశాడు. అయితే ఐదో టెస్ట్‌కి ముందు గిల్ ఐసిసి ర్యాంకుల్లో 9వ స్థానంలో ఉన్నాడు. కానీ, చివరి టెస్టులో అతను కేవలం 32 పరుగులు మాత్రమే చేశాడు. ఇదే అతని ర్యాంకుపై ప్రభావం చూపించింది. ఐదో టెస్ట్‌లో కనీసం అర్ధశతకం సాధించిన గిల్ ర్యాంకు రేటింగ్‌లో బాగా తేడా వచ్చేదే. గిల్ విషయం పక్కన పెడితే చివరి టెస్టులో శతకం సాధించిన యశస్వీ జైస్వాల్ మూడు స్థానాలు మెరుగుపరచుకోగా.. ఐదో టెస్ట్ ఆడకపోవడంతో పంత్ ఒకస్థానం కోల్పోయాడు.

### ఆ ఇద్దరితో మాట్లాడాను..

# పంత్ ఏమన్నాడంటే..: క్రిస్ వోక్స్



భారత్-ఇంగ్లండ్ మధ్య జరిగిన టెండూల్కర్-ఆండర్సన్ సిరీస్ డ్రాగా ముగిసింది. ఈ సిరీస్‌లో ప్రతీ మ్యాచ్ ఎంతో ఉత్కంఠభరితంగా సాగింది. తమ తమ జట్లను గెలిపించుకొనేందుకు ప్రతీ ఆటగాడు తీవ్రంగా కృషి చేశారు. కానీ, ఓ ఇద్దరు మాత్రం తమ జట్టు కోసం అత్యంత సాహసోపేత నిర్ణయం తీసుకున్నారు. అందులో ఒకరు భారత ఆటగాడు రిషబ్ పంత్ కాగా, మరొకరు ఇంగ్లండ్ బౌలర్ క్రిస్ వోక్స్ (%జస్త్రతీఅం ఔశ్మీుఎవం%). రిషబ్ పంత్ కాలికి గాయమైనా సరే బ్యాటింగ్ వచ్చి అర్ధ శతకం సాధించి.. జట్టుకు విలువైన పరుగులు అందించాడు. ఇక క్రిస్ వోక్స్ భుజం ఫ్రాక్చర్ అయినా సరే ఐదో టెస్ట్‌లో చివరి వికెట్‌గా వచ్చి జట్టును గెలిపించేందుకు పోరాడాడు. ఈ క్రమంలో వోక్స్‌ని భారత ఆటగాళ్లు అభినందించారు. అయితే తనకు భారత కెప్టెన్ శుభ్‌మాన్ గిల్, వైస్ కెప్టెన్ రిషబ్ పంత్ నుంచి సందేశాలు వచ్చాయని వోక్స్ తాజాగా వెల్లడించాడు. నొప్పితోనే బ్యాటింగ్‌కి వచ్చినందుకు గిల్ తనను అభినందించాడని వోక్స్ (%జస్త్రతీఅం ఔశ్మీుఎవం%) తెలిపాడు. "ఐదో టెస్ట్ ముగిసిన తర్వాత గిల్‌తో మాట్లాడాను. తనకు ఇది గొప్ప సిరీస్‌గా నిలిచిపోతుందని చెప్పాను. జట్టు కోసం బాగా ఆడావని.. జట్టును ముందుండి నడిపించావని చెప్పాను" అని వోక్స్ తెలిపాడు. ఇక క్రిస్ వోక్స్ బౌలింగ్‌లోనే రిషబ్ పంత్‌కు గాయమైన విషయం తెలిసిందే. రివర్స్ స్వీప్ ఆడేందుకు ప్రయత్నించడంతో బంతి పంత్ కాలికి తగిలి తీవ్ర గాయమైంది. దీంతో నొప్పితో విలవిలలాడుతున్న అతన్ని గోల్ఫ్ కార్ట్‌లో తీసుకెళ్లారు. కానీ, ఆ తర్వాత కొంత సమయానికే బ్యాటింగ్‌కి వచ్చి అర్ధశతకం పూర్తి చేసుకున్నాడు. ఈ విషయంపై వోక్స్ మాట్లాడుతూ.. "నా ఫోటోకు రిషబ్ పంత్ ఇన్‌స్టాగ్రామ్‌లో సెల్యూట్ ఎమోజీ పెట్టాడు. నేను థాంక్యూ అని చెప్పి.. పాదం బాగానే ఉందని అనుకుంటున్నా అని రిప్లై ఇచ్చాను. దానికి పంత్ వాయిస్ మెసేజ్ పంపించాడు. 'అంతా మంచే జరగాలని ఆశిస్తున్నా. త్వరగా కోలుకోవాలి. తప్పకుండా మనం ఏదో ఒక రోజు కలుద్దాం' అని అన్నాడు. నేను అతని పాదం అలా దెబ్బ తిన్నందుకు సారీ చెప్పాను" అని వోక్స్ అన్నాడు. ఇక జట్టుకు 100 పరుగులు అవసరం ఉన్నా.. బ్యాటింగ్‌కు వచ్చే వాడినని.. అందుకు తనకు ఎలాంటి బాధ లేదని అన్నాడు. కానీ, చివరకు జట్టు ఓడిపోవడం తనకు బాధ కలిగించిందని.. తన లాగే ఇతర జట్ల ఆటగాళ్లూ ఇదే చేస్తారని ఆశిస్తున్నట్లు వెల్లడించాడు.

# సిరాజ్‌పై ఓవైసీ ప్రశంసలు.. మియాన్ రిప్లై ఇదే..




ఇంగ్లండ్‌తో జరిగిన ఐదు టెస్టుల సిరీస్‌లో హైదరాబాదీ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ (%వీశీష్ట్రుఎఝ్రు ూఅతీఝుయ%) అదరగొట్టాడు. ఐదు టెస్టుల్లో కలిపి 23 వికెట్లు తీసి.. సిరీస్‌కే అత్యధిక వికెట్ టేకర్‌గా నిలిచాడు. ముఖ్యంగా ఓడిపోయే పరిస్థితుల్లో ఉన్న ఆఖరి టెస్ట్‌లో అద్భుతంగా బౌలింగ్ చేసి.. జట్టుకు విజయాన్ని అందించాడు. ఈ సందర్భంగా సిరాజ్‌పై ప్రశంసల వర్షం కురుస్తోంది. మాజీల నుంచి అభిమానుల వరకూ అందరు అతన్ని పొగడ్తలతో ముంచెత్తుతున్నారు. ఈ క్రమంలో హైదరాబాద్ ఎంపి అసదుద్దీన్ ఓవైసీ కూడా సిరాజ్‌ని మెచ్చుకున్నారు. 'ఆల్వేస్ ఏ విన్నర్.. హైదరాబాదీలా చెప్పాలంటే.. పూరా ఖోల్ దియే పాషా' అని పోస్ట్ పెట్టారు. దీనికి మియాన్‌ఆసక్తికర రిప్లై ఇచ్చాడు. "ధన్యవాదాలు సార్, ఎప్పుడూ నన్ను ప్రోత్సహిస్తూ చీర్ చేస్తున్నందుకు కృతజ్ఞతలు" అంటూ హార్ట్ సింబల్, నమస్కారం చేసినట్లుగా ఉంటే సింబల్ ఎమోజీలతో తన సందేశాన్ని తెలియజేశాడు. ఇక ఇంగ్లండ్ సిరీస్‌లో అద్భుత ప్రదర్శన చేసిన సిరాజ్ తన ర్యాంకును మెరుగుపరుచుకున్నాడు. ఓవల్ టెస్ట్‌లో 9 వికెట్లు తీసిన సిరాజ్ 12 స్థానాలు ఎగబాకి 674 రేటింగ్‌తో 15వ స్థానంలో నిలిచాడు.

### రోజూ మధ్యాహ్నం భోజనం చేశాక

# ఒక గ్లాస్ మజ్జిగను తాగండి..



ఒకప్పుడు చాలా మంది ఇళ్లలో కచ్చితంగా ఆవులు లేదా గేదెలు ఉండేవి. దీంతో అందరి ఇళ్లలోనూ పాలు, పెరుగు, మజ్జిగ, నెయ్యికి లోటు ఉండేది కాదు. ఆయా ఆహారాలను మన పూర్వీకులు, పెద్దలు అధికంగా తినే వారు. అందుకనే వారు ఎంతో ఆరోగ్యంగా ఉండేవారు. అయితే ఇప్పుడు చాలా మంది వాటిని తీసుకోవడం లేదు. కనీసం భోజనం చివర్లో పెరుగు లేదా మజ్జిగతో కూడా తినడం లేదు. కానీ ఈ ఆహారాలు మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిల్లో లాక్టిక్ యాసిడ్ అనే బ్యాక్టీరియా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థకు ఎంతో మేలు చేస్తుంది. కనుక రోజూ భోజనం చేసిన తరువాత కనీసం ఒక పూట అయినా సరే మజ్జిగను తాగాలని పోషకాహార నిపుణులు, ఆయుర్వేద వైద్యులు చెబుతున్నారు. మజ్జిగను రోజువారి ఆహారంలో భాగం చేసుకోవాలని, దీంతో అనేక లాభాలు కలుగుతాయని అంటున్నారు. మజ్జిగను చక్కని ప్రో బయోటిక్ ఆహారంగా చెబుతారు. అందువల్ల దీన్ని తీసుకుంటే జీర్ణ వ్యవస్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందుతుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. మజ్జిగను తాగడం వల్ల మనం తిన్న ఆహారంలో ఉండే పోషకాలను శరీరం సరిగ్గా శోషించుకుంటుంది. దీని వల్ల పోషకాహార లోపం తగ్గుతుంది. జీర్ణక్రియ మెరుగు పడుతుంది. అజీర్తి తగ్గుతుంది. కడుపు ఉబ్బరం, గ్యాస్ సమస్యల నుంచి ఉపశమనం లభిస్తుంది. మజ్జిగ మన శరీరానికి చలువ చేస్తుంది. శరీరంలో ఉన్న వేడిని తగ్గిస్తుంది. అందువల్ల జ్వరం వచ్చిన వారు తగ్గితే ఉష్ణోగ్రత అదుపులో ఉంటుంది. జ్వరం నుంచి త్వరగా కోలుకుంటారు. అలాగే జీర్ణాశయంలో ఉత్పత్తి అయ్యే యాసిడ్ల ప్రభావం తగ్గుతుంది. దీంతో అసిడిటీ నుంచి ఉపశమనం లభిస్తుంది. గుండెల్లో మంట సైతం తగ్గుతుంది. మజ్జిగ ప్రో బయోటిక్ ఆహారం కనుక మలబద్దకం ఉన్నవారికి మేలు చేస్తుంది. రోజూ మజ్జిగను సేవిస్తుంటే మలబద్ధకం నుంచి బయట పడవచ్చు. మజ్జిగను తాగితే అందులో 90 శాతం నీరు ఉంటుంది కనుక శరీరం హైడ్రేటెడ్‌గా మారుతుంది. దీంతో శరీరంలో ద్రవాలు సమతుల్యంలో ఉంటాయి. మజ్జిగలో ఉండే పొటాషియం, సోడియం ఎలక్ట్రోలైట్స్ గా పనిచేస్తాయి. దీంతో శరీరం కోల్పోయిన ద్రవాలను తిరిగి పొందుతుంది. డీహైడ్రేషన్ బారిన పడకుండా ఉంటారు. బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు, బరువు నియంత్రణలో ఉండాలని కోరుకునే వారు మజ్జిగను ఆహారంలో భాగం చేసుకుంటే మేలు జరుగుతుంది. మజ్జిగలో క్యాలరీలు చాలా తక్కువగా ఉంటాయి. పాలు, పెరుగు కన్నా కొవ్వు కూడా చాలా తక్కువగా ఉంటుంది. కనుక మజ్జిగను తాగితే బరువు పెరుగుతామన్న భయం ఉండదు. మజ్జిగను సేవించడం వల్ల అందులో ఉండే ప్రోటీన్లు పొట్ట నిండిన భావనను కలిగిస్తాయి. దీంతో ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. దీని వల్ల ఆహారం తక్కువగా తింటారు.

### గోరు చిక్కుడు కాయలను తరచూ తింటే

# ఎన్ని లాభాలు కలుగుతాయో తెలుసా..?



మార్కెట్‌లో మనకు రకరకాల కూరగాయలు అందుబాటులో ఉంటాయి. ఈ క్రమంలోనే ఎవరి స్థోమత, అభిరుచికి తగినట్లు వారు ఆయా కూరగాయలను కొని తెచ్చి రోజూ వండుకుని తింటుంటారు. అయితే టమాటా వంటి కూరగాయలను మనం ఎక్కువగా తింటాం. కానీ కొన్ని రకాల కూరగాయలను మాత్రం చాలా మంది మరిచిపోతుంటారు. వాస్తవానికి అలాంటి కూరగాయలు మనకు ఆరోగ్య పరంగా ఎంతగానో మేలు చేస్తాయి. అలాంటి కూరగాయల్లో గోరు చిక్కుడు కూడా ఒకటి. గోరు చిక్కుడు కాయలు మనకు సంవత్సరం పొడవునా అన్ని సీజన్లలోనూ అందుబాటులో ఉంటాయి. ఈ కాయలతో వేపుడు చేసి తింటే రుచి అదిరిపోతుంది. కొందరు వీటితో కూర చేసుకుని కూడా తింటారు. అయితే పోషకాహార నిపుణులు చెబుతున్న ప్రకారం గోరు చిక్కుడు కాయలు మనకు ఎంతో మేలు చేస్తాయి. వీటిని ఆహారంలో భాగం చేసుకుంటే అనేక లాభాలను పొందవచ్చు.జీర్ణ వ్యవస్థ ఆరోగ్యానికి.. గోరు చిక్కుడు కాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది జీర్ణ వ్యవస్థను ఆరోగ్యంగా ఉంచుతుంది. ఫైబర్ వల్ల పేగుల్లో మలం కదలికలు సరిగ్గా ఉంటాయి. దీంతో మలబద్దకం తగ్గుతుంది. ఈ కాయలు జీర్ణ వ్యవ్థలో మంచి బ్యాక్టీరియా వృద్ధి చెందేలా చేస్తాయి. దీంతో జీర్ణ వ్యవస్థ పనితీరు మెరుగు పడుతుంది. గోరు చిక్కుడు కాయల గ్లైసీమిక్ ఇండెక్స్ చాలా తక్కువగా ఉంటుంది. అందువల్ల ఈ కాయలను తింటే రక్తంలో షుగర్ లెవల్స్ నెమ్మదిగా పెరుగుతాయి. పైగా ఈ కాయల్లో ఫైబర్ అధికంగా ఉంటుంది. ఇది షుగర్ తగ్గేందుకు సహాయం చేస్తుంది. అందువల్ల దయాబెటిస్ ఉన్నవారికి ఈ కాయలు ఎంతో మేలు చేస్తాయి. వీటి వల్ల షుగర్‌ను నియంత్రణలో ఉంచుకోవచ్చు. గోరు చిక్కుడు కాయల్లో ఉండే ఫైబర్ శరీరంలో చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గిస్తుంది. మంచి కొలెస్ట్రాల్ పెరిగేలా చేస్తుంది. దీంతో గుండె ఆరోగ్యంగా ఉంటుంది. హార్ట్ ఎటాక్ రాకుండా చూస్తుంది. ఈ కాయల్లో అధికంగా ఉండే పొటాషియం, ఫోలేట్ బీపీని నియంత్రించేందుకు సహాయం చేస్తాయి. దీని వల్ల హైబీపీ ఉన్నవారికి మేలు జరుగుతుంది. ఈ కాయలను తింటే బీపీని అదుపులో ఉంచుకోవచ్చు. అలాగే గుండె పనితీరు మెరుగు పడుతుంది. గోరు చిక్కుడు కాయల్లో అధికంగా ఉండే ఫైబర్ బరువు తగ్గాలనుకునే వారికి మేలు చేస్తుంది. ఈ కాయల్లో ప్రోటీన్లు ఎక్కువగా, క్యాలరీలు తక్కువగా ఉంటాయి. కనుక ఈ కాయలను తింటే ఎక్కువ సేపు ఉన్నా ఆకలి వేయదు. కడుపు నిండిన భావనతో ఉంటారు. దీంతో ఆహారం తక్కువగా తింటారు. ఇది బరువు తగ్గేందుకు సహాయం చేస్తుంది. బరువు తగ్గాలనుకునే ప్రణాళికలో ఉన్నవారు తరచూ ఈ కాయలను తింటే మేలు జరుగుతుంది. గోరు చిక్కుడు కాయల్లో క్యాల్షియం, ఫాస్ఫరస్ అధికంగా ఉంటాయి. ఇవి ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచుతాయి. ఎముకలు నిర్మాణం అయ్యేలా చేస్తాయి. ముఖ్యంగా విరిగిన ఎముకలు అతుక్కుంటున్న వారు ఈ కాయలను తింటే మేలు జరుగుతుంది. ఎముకలు త్వరగా అతుక్కుంటాయి. గోరు చిక్కుడు కాయలను తింటే వృద్ధాప్యంలో వచ్చే ఆస్టియో పోరోసిస్, ఆర్థరైటిస్ వంటి ఎముకల సంబంధిత వ్యాధులు రాకుండా అడ్డుకోవచ్చు.

# తాజా కూరగాయలు దాచేద్దాం



వర్షాకాలం వచ్చిందంటే కూరగాయలు నిల్వ చేయడం చాలా కష్టం. అందులోనూ ఆకుకూరలైతే త్వరగా పాడైపోతాయి. ఆకుకూరలు పోషకాల పవర్‌హౌస్ లాంటివి. తోటకూర, పాలకూర, మెంతి, బచ్చలి, గోంగూర.. వీటిల్లో పొటాషియం, మెగ్నీషియం, సోడియం, క్యాల్షియం, ఐరన్, ప్రొటీన్లు, విటమిన్లు అధికంగా ఉంటాయి. చాలామంది వారానికి సరిపడా ఆకుకూరలు ఒకేసారి తెచ్చేస్తూ ఉంటారు. ఫ్రిజ్‌లో పెట్టినా ఇవి ఎక్కువ రోజులు తాజాగా ఉండడం కష్టమే. ఈ టిప్స్ ఫాలో అయితే, ఆకుకూరలను ఎక్కువ రోజులు స్టోర్ చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం.. కుకూరలు త్వరగా పాడవడానికి కారణం అధిక తేమ. వీటిని స్టోర్ చేయడానికి, ముందుగా ఆకులు పొడిగా ఉండేలా చూసుకోవాలి. చెడిపోయిన ఆకులను తీసేసి శుభ్రమైన క్లాత్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇలా చేస్తే.. ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. టిష్యూలు కూడా వాడుకోవచ్చు. ప్లాస్టిక్ డబ్బాలో టిష్యూలను పేర్చి ఆకుకూరలు పెట్టి పైనుంచి మళ్లీ టిష్యూలను పరిచి మూతపెట్టి ఫ్రిజ్‌లో పెట్టడం వల్ల నాలుగు రోజుల వరకు తాజాగా ఉంటాయి. చెడిపోయిన అయితే, ఆకుకూరలను ఎక్కువ రోజులు స్టోర్ చేసుకోవచ్చు. అవేంటో చూద్దాం.. కుకూరలు త్వరగా పాడవడానికి కారణం అధిక తేమ. వీటిని స్టోర్ చేయడానికి, ముందుగా ఆకులు పొడిగా ఉండేలా చూసుకోవాలి. చెడిపోయిన ఆకులను తీసేసి శుభ్రమైన క్లాత్‌లో చుట్టి ఫ్రిజ్‌లో పెట్టాలి. ఇలా చేస్తే.. ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. టిష్యూలు కూడా వాడుకోవచ్చు.ఆకులను తీసేసి వేర్లు, కాడలు కత్తిరించాలి. తరిగిన ఆకుకూరల్ని న్యూస్ పేపర్‌లో పెట్టి రోల్ చేయాలి. ఈ రోల్‌ను జిప్-లాక్ బ్యాగ్‌లో పెట్టి ఫ్రిజ్‌లో స్టోర్ చేస్తే వారం వరకూ ఫ్రెష్‌గా ఉంటాయి. ఆకు కూరలను ఎయిర్ టైట్ కంటైనర్‌లో మస్లిన్ క్లాత్ వేసి ఉంచాలి. ఆ తర్వాత వాటిని డబ్బాలో పెట్టాలి. ఇలా చేస్తే ఆకుకూరలు ఎక్కువ రోజులు నిల్వ ఉంటాయి. వివిధ రకాల ఆకుకూరలను ఒకేచోట కలిపి ఉంచకూడదు. పాలకూర, మెంతికూర లాంటివి ఇథిలీన్ వాయువును విడుదల చేస్తాయి, ఇది ఇతర ఆకుకూరలను త్వరగా చెడగొడుతుంది. అందువల్ల అన్నింటినీ కలిపి కాకుండా వేర్వేరు సంచుల్లో నిల్వ చేయాలి.

# ఉదయాన్నే ఖాళీ కడుపుతో కరివేపాకు నీరు తాగితే..?



కరివేపాకు అనేది భారతీయ వంటలలో ఉపయోగించే ఓ ఆరోగ్యకరమైన మూలిక. ఇది వంటలకు రుచిని మాత్రమే కాకుండా అనేక ఆరోగ్య ప్రయోజనాలను కూడా అందిస్తుంది. దీంతో అతిగా ఆహారం తినకుండా ఉంటాం. కరివేపాకులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో ఈ నీరు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా దీనివల్ల మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. గ్యాస్, అపచయం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.కరివేపాకు హైపోగ్లైసీమిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల దీనిలో ఉండే యాంటీఆక్సిడెంట్లు, ఫైబర్, విటమిన్లు, ఖనిజాలు శరీరానికి తగిన పోషకాలను అందించి ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి. అయితే, ఖాళీ కడుపుతో కరివేపాకు నీటిని తాగడం వల్ల ఎలాంటి ప్రయోజనాలు కలుగుతాయో తెలుసుకుందాం .కరివేపాకులో తక్కువ కేలరీలు, అధిక ఫైబర్ ఉండటం వల్ల ఇది బరువు తగ్గాలనుకునేవారికి చాలా ఉపయోగపడుతుంది. ఖాళీ కడుపుతో ఈ నీటిని తాగితే కడుపు నిండిన భావన కలుగుతుంది. దీంతో అతిగా ఆహారం తినకుండా ఉంటాం. కరివేపాకులో ఫైబర్ అధికంగా ఉంటుంది. దీంతో ఈ నీరు జీర్ణక్రియను మెరుగుపరుస్తుంది. అంతేకాకుండా దీనివల్ల మలబద్ధకం సమస్య నుండి ఉపశమనం లభిస్తుంది. గ్యాస్, అపచయం వంటి సమస్యలు కూడా తగ్గుతాయి.కరివేపాకు హైపోగ్లైసీమిక్ లక్షణాలను కలిగి ఉంటుంది. ఇది రక్తంలో గ్లూకోజ్ స్థాయిని నియంత్రించడంలో సహాయపడుతుంది. అందువల్ల ఇది మధుమేహం ఉన్న వారికి చాలా లాభదాయకం. కరివేపాకాలోని పోషకాలు చెడు కొలెస్ట్రాల్‌ను తగ్గించడంలో సహాయ పడతాయి. దీని వల్ల గుండె సంబంధిత వ్యాధుల ప్రమాదం కూడా తగ్గుతుం ది. ఇందులో యాంటీఆక్సిడెంట్లు అధికంగా ఉండటం వల్ల ఇది చర్మాన్ని శుభ్రంగా, ప్రకాశవంతంగా ఉంచుతుంది. అలాగే జుట్టు రాలడాన్ని తగ్గించి, వృద్ధిని ప్రోత్సహిస్తుంది.

# నాని టైర్-2 హీరోనా..?



టాలీవుడ్ నేచురల్ స్టార్ నాని ఇప్పుడు ఓ రేంజ్ లో దూసుకు పోతున్న విషయం తెలిసిందే. వరుస హిట్స్ తో ఫుల్ జోష్ లో ఉన్న ఆయన.. ఇప్పుడు మరిన్ని సినిమాలతో బిజీగా ఉన్నారు. క్రేజీ ప్రాజెక్టులు తన లైనప్ లో చేర్చుకుంటున్నారు. రీసెంట్ గా హిట్-3తో వచ్చి బ్లాక్ బస్టర్ హిట్ ను సొంతం చేసుకున్న నాని.. అంతకుముందు హ్యాట్రిక్ సాధించారు. దసరా మూవీతో మంచి హిట్ సొంతం చేసుకున్న నేచురల్ స్టార్.. ఆతర్వాత హాయ్ నాన్న మూవీతో మెప్పించారు. మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకున్నారు. అనంతరం సరిపోదా శనివారంతో ఇంకో హిట్ ను సాధించారు. ఇప్పుడు హిట్-3తో వరుసగా నాలుగో విజయాన్ని అందుకున్నారు. ఇప్పుడు ప్యారడైజ్ మూవీ లో నటిస్తూ బిజీగా ఉన్నారు. శ్రీకాంత్ ఓదెల దర్శకత్వం వహిస్తున్న ఆ సినిమా.. నాని కెరీర్ లోనే హైయెస్ట్ బడ్జెట్ తో రూపొందుతోంది. వచ్చే ఏడాది మార్చి 26న రిలీజ్ కానున్న ఆ మూవీపై ఇప్పటికే ఆడియన్స్ లో భారీ అంచనాలు ఉన్నాయి. రీసెంట్ గా లీక్ అయిన నాని లుక్.. వాటిని మరింత పెంచింది. హైదరాబాద్ బ్యాక్ డ్రాప్ లో గ్యాంగ్ స్టర్ డ్రామాగా రూపొందనుంది. ఆ సినిమాతో కూడా హిట్ అందుకుంటారని అంతా అప్పుడే ఫిక్స్ అయిపోయారు. అదే సమయంలో టాలీవుడ్ టైర్-2 హీరోల్లో నాని ప్రత్యేక స్థానాన్ని ఏర్పరచుకు న్నారు. అనేక విషయాల్లో నాని టాప్ లో ఉన్నారు. కొంతకాలంగా ఆయన నటిస్తున్న సినిమాలు అన్ని.. స్ట్రాంగ్ ఓపెనింగ్స్ సాధిస్తున్నాయి. బలమైన బాక్సాఫీస్ పుల్ ను చూపిస్తున్నాయి. ఓవర్సీస్ లో కూడా మిలియన్ డాలర్ మార్క్ క్రాస్ చేస్తున్నాయి. అక్కడ కూడా నానికి మంచి ఫ్యాన్‌బేస్ ఉంది. దీంతో ఆయన నటించిన సినిమాలు ఫారిన్ లో కూడా సాలిడ్ కలెక్షన్స్ సాధిస్తున్నాయి. ముఖ్యంగా నేచురల్ స్టార్ సినిమాలు మినిమమ్ గ్యారంటీ అంతా ఫిక్స్ అయ్యేలా క్రేజ్ సంపాదించుకున్నారు. వర్త్ బుల్ మూవీస్ అనేలా స్టాంప్ వేసుకున్నారు. అదంతా ఆయన స్క్రిప్ట్ సెలక్షన్ వల్లే అని చెప్పాలి. ఎందుకంటే ప్రేక్షకులు భావోద్వేగపరంగా కనెక్ట్ అయ్యే కథలు మాత్రమే నాని ఎంచుకుంటున్నారు. అటు కమర్షియల్ గా.. ఇటు కంటెంట్ బేస్డ్ గా సమతుల్యం చేసుకుంటున్నారు. ముఖ్యంగా యాక్టింగ్ తో మెప్పిస్తున్నారు. ఓవరాల్ గా టైర్-2లో ఎవరూ చేరుకోలేని స్టేజ్ కు చేరుకున్నా రని అంతా అంటున్నారు. అదే సమయంలో టైర్-2 కాదు.. నాని టైర్ -1 హీరో అనే చెప్పాలి. సెకెండ్ టైర్ నుంచి ఎప్పుడో ఫస్ట్ టైర్ కు వెళ్లిపోయారు. వరుస హిట్స్ తో తన రేంజ్ ను పెంచుకున్నారు. అందుకే ఇప్పుడు ఆయన టైర్-2 హీరో కాదు.. అంతకుమించే. అయితే నానికి మాత్రం టైర్-2, టైర్-1 వంటి పదాలు అస్సలు నచ్చవన్న విషయం తెలిసిందే.

# సినిమా.. ఫ్లాపులతో కొట్టుమిట్టాడుతున్న మృణాల్..

హిందీ టీవీ సీరియల్ నటిగా కెరియర్ ఆరంభించి, ఆ తర్వాత నటిగా గుర్తింపు సొంతం చేసుకుంది మృణాల్ ఠాకూర్. తెలుగులో హను రాఘవపూడి దర్శకత్వంలో.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ ప్రధాన పాత్రలో నేరుగా తెలుగులో నటించిన తొలి చిత్రం సీతారామం. ఈ సినిమాలో సీత పాత్రలో చాలా అద్భుతంగా ఒదిగిపోయి నటించింది మృణాల్ ఠాకూర్. తెలుగులో మొదటి సినిమానే అయినా.. ఆ సినిమాలోని పాత్రతో తెలుగువారి హృదయాలను దోచుకుంది.పైగా తెలుగు ఆడియన్స్ ఈమెను ఓన్ చేసుకున్నారు. తర్వాత నాచురల్ స్టార్ నాని హీరోగా నటించిన హాయ్ నాన్న సినిమాలో కూడా నటించి మరో విజయాన్ని తన ఖాతాలో వేసుకుంది. ఆ తర్వాత విజయ్ దేవరకొండ హీరోగా వచ్చిన ది ఫ్యామిలీ స్టార్ సినిమాలో కూడా కథానాయికగా నటించింది కానీ ఈ సినిమా పెద్దగా వర్కౌట్ కాలేదు. ఇక ఈ సినిమా తర్వాత ఈమెకు తెలుగులో అవకాశాలు రాలేదు. పైగా దాదాపు ఐదు సంవత్సరాల సినీ కెరియర్లో రెండు చిత్రాలు తప్ప మరో సినిమా ఈమెకు విజయాన్ని అందించలేదు. అటు కథానాయికగా ఎదిగిన బాలీవుడ్ లో కూడా వరుసగా ఎదురు దెబ్బలు తగులుతూనే వచ్చాయి. 2019లో హృతిక్ రోషన్ హీరోగా నటించిన సూపర్ 30 సినిమాతో మంచి బ్రేక్ అందుకున్న ఈమె.. ఆ తర్వాత ఒక్క సినిమాతో కూడా సక్సెస్ అందుకోలేకపోయింది. సూపర్ 30 తరువాత బాలీవుడ్ లో తూఫాన్, బాట్లా హౌస్, జెర్సీ,సెల్ఫీ, గుమ్రా, ఆంఖ్ మిచోలి, పిప్పా ఇలా పలు చిత్రాలు చేసింది. కానీ వరుస పరాజయాలే పలకరించాయి. ఇక ఇప్పుడు సన్నాఫ్ సర్దార్ 2లో కూడా నటించింది. అజయ్ దేవగన్ హీరోగా నటించిన ఈ సినిమా కూడా గత శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు ప్రీ రిలీజ్ బస్ పెద్దగా లేకపోవడం వల్ల ఓపెనింగ్స్ రాలేదు. టికెట్ పై 50% ఆఫర్ పెట్టినా కూడా తొలిరోజు థియేటర్లలో జనం కనిపించకపోవడం, పైగా డివైడ్ టాక్ రావడంతో కలెక్షన్లు కూడా సాధించలేకపోయింది. దాంతో వారంలోపే డిజాస్టర్ మూవీగా తేలిపోయింది ఈ సినిమా.



# నేషనల్ క్రష్ రష్మికా చిట్టి చెల్లెలు.. భవిష్యత్ లో హీరోయిన్!



నేషనల్ క్రష్ రష్మికా మందన్నా పరిచయం అవసరం లేని పేరు. పాన్ ఇండియాలో అమ్మడిప్పుడో సంచలనం. వరుస విజయాలతో ఓ బ్రాండ్ గా మారింది. తెలుగు, హిందీలో ఎంత మంది హీరోయిన్లు ఉన్నా? రష్మిక మాత్రం సంథింగ్ స్పెషల్ గా మార్కెట్ లో వెలిగిపోతుంది. స్టార్ హీరోలే అమ్మడితో కలిసి నటించడానికి క్యూ కడుతున్నారు. భవిష్యత్ లో మరిన్ని శిఖరాలను అధిరోహించడం ఖాయంగా కనిపిస్తోంది. ప్రస్తుతం వరుస ప్రాజెక్ట్ లతో బిజీగా ఉంది. మార్కెట్ కు తగ్గట్టు పారితోషికంగా భారీగానే అందుకుంటుంది. కెరీర్ పరంగా కొన్నాళ్ల పాటు చూసుకునే పనిలేదు. ఇక ఖాళీ సమయం దొరికిందంటే కుటుంబంతో అంతే ఆస్వాదిస్తుంది. మామ్ -డాడ్ తో ఉన్న వీడియోలను నెట్టింట పోస్ట్ చేస్తుంది. అయితే ఈ అమ్మడికి ఓ చిట్టి చెల్లెలు ఉందన్నది? పెద్దగా ఎవరికీ తెలియదు. చిట్టి చెల్లెలు అంటే ఏకంగా మేక పిల్ల ఎక్కించుకుని మరీ తిప్పేంత చెల్లెలు ఉంది? అన్నది ఇప్పుడే బయటకు వచ్చింది. రష్మిక వయసు 29 సంవత్సరాలు కాగా...చెల్లితో వయసు వ్యత్యాసం 16 ఏళ్లు ఉంది. ఈ విషయాన్ని రష్మిక స్వయంగా తెలిపింది.

# అందుకోసమే అయితే పొలం పనులు చేస్తా..!

సత్యదేవ్ కెరీర్ జర్నీ గురించి తెలిసిందే. క్యారెక్టర్ ఆర్టిస్ట్ గా పరిచయమై ప్రధాన పాత్రలకు ప్రమోట్ అయిన నటుడు. వైవిధ్యమైన నటనతో తనకంటూ ప్రత్యేకమైన గుర్తింపును దక్కించుకున్నాడు. లెజెండరీ చిరంజీవే సత్యదేవ్ నటనకు ఫిదా అయిన సందర్భం తెలిసిందే. 'గాడ్‌ఫాదర్' లో విలన్ పాత్రకు చిరుయువ నటుడి ఏరికోరి మరీ తీసుకున్నారు. ఎలాంటిపాత్రైనా అవలీలగా పోషించగల నటుడు కావడంతో? ఈతరహా అవకాశాలు అందుకుంటున్నా డు. ఇటీవలే రిలీజ్ అయిన 'కింగ్ డమ్'లో సత్యదేవ్ కీలక పాత్రతో అలరించిన సంగతి తెలిసిందే. విజయ్ దేవరకొండకు అన్నయ్య పాత్రలో ప్రేక్షకుల్ని అలరించాడు. ప్రస్తుతం నటుడిగా కొన్ని సినిమాలతో బిజీగా ఉన్నాడు. నటుడిగా పారితోషికం కూడా మార్కెట్ ఆధారంగా అందుకుంటున్నాడు. అయితే సత్యదేవ్ ముందుకు ఓ ఇంట్రెస్టింగ్ కృశ్చన్ వెళ్లింది. సినిమాల్లోకి రావడానికి కారణంగా ప్యాషన్ తోనా? పారితోషికం కోసమా? అనే ప్రశ్న ఉత్పన్నమైంది. అందుకు సత్యదేవ్ తాను కేవలం ప్యాషన్ తో మాత్రమే సినిమాల్లోకి వచ్చినట్లు తెలిపారు. చెప్పుకోవడా నికి సాఫ్ట్ వేర్ ఉద్యోగం ఉన్నా? మనసంతా సినిమాలపై ఉండటంతో ఉద్యోగం చేస్తూనే సినిమా ప్రయత్నాలు చేసి సక్సెస్ అయినట్లు తెలిపారు. కేవలం డబ్బు కోసమే సినిమాలను అనుకుంటే? తన ఊరి వెళ్లి పొలం పనులు చేసుకున్నా డబ్బు వస్తుందన్నారు.



# మరో కొత్త బిజినెస్‌లోకి సమంత..!



సౌత్ స్టార్ హీరోయిన్ సమంత రీసెంట్ గా సినిమాల విషయంలో చాలా తక్కువగా వార్తల్లో నిలుస్తున్నారు. సమంతపై వార్తలొస్తున్నప్పటికీ అవి ఆమె సినిమాలకు సంబంధించినవి కాకుండా తన పర్సనల్ విషయాల గురించే ఎక్కువగా వస్తున్నాయి. ఎన్నో ఛాలెంజింగ్ రోల్స్ తో పాటూ చాలా స్ట్రాంగ్ క్యారెక్టర్లను చేస్తూ వచ్చిన సమంత ఇటీవల ఎలాంటి పెద్ద సినిమాల్లోనూ నటించింది లేదు. పెద్ద సినిమాల్లో నటించక పోవడమే కాకుండా ఎలాంటి పెద్ద ప్రాజెక్టునీ అనౌన్స్ కూడా చేయలేదు. దీంతో సమంత తర్వాతి ప్రాజెక్టు ఏంటా అని అందరూ ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. తాజా సమాచారం ప్రకారం సమంత ఇప్పుడు మరో కొత్త వెంచర్ లోకి అడుగుపెడుతున్నట్టు తెలుస్తోంది. ఇప్పటికే నటిగా, నిర్మాతగా, వ్యాపారవేత్తగా సక్సెస్ అయిన సమంత ఇప్పుడు మరో కొత్త బిజినెస్ లోకి ఎంటరవుతున్నారని సమాచారం. అదే లగ్జరీ పెర్ఫ్యూమ్. కేవలం కొత్త పర్ఫ్యూమ్ ను స్టార్ట్ చేయడమే కాకుండా దాన్ని ప్రీమియం లైఫ్ స్టైల్ బ్రాండ్ గా మార్చడానికి సమంత ప్రయత్నిస్తున్నారని సమంత సన్నిహిత వర్గాలంటున్నాయి. ఈ నేపథ్యంలోనే కాన్సెప్ట్ నుంచి బ్రాండింగ్ వరకు ప్రతీ దానిలోనూ సమంత ఇన్వాల్వ్ అవుతూ జాగ్రత్తలు తీసుకుంటున్నారని తెలుస్తోంది. ఫ్యాషన్ రంగంలో ఎప్పుడూ ముందుండే సమంత ఈ ఫ్యాషన్ ప్రాజెక్టును సక్సెస్‌ఫుల్ గా మార్చాలని డిసైడై అందుకు తగ్గ అడుగులు వేస్తున్నట్టు కనిపిస్తోంది. ఇది సక్సెస్ అయితే సమంత కెరీర్లోనే ఓ కొత్త అధ్యాయం సృష్టించినట్టు అవుతుంది. సినిమాల విషయానికొస్తే సమంత వరుస పెట్టి సినిమాలను ఒకే చేయకుండా స్క్రిప్ట్ విషయంలో చాలా జాగ్రత్తగా వ్యవహరిస్తున్నారు. గతేడాది మొత్తం మయోసైటిస్ వల్ల సినిమాలకు దూరంగా ఉన్న సమంత ఇప్పుడు తన కంబ్యాక్ చాలా స్ట్రాంగ్ గా ఉండాలని దానికి తగ్గ కథలనే ఎంచుకుంటున్నారు. ఇప్పటివరకైతే సమంత ఎలాంటి ప్రాజెక్టుకీ సైన్ చేయలేదు కానీ రెండు ప్రాజెక్టులు చర్చల దశల్లో ఉన్నట్టు తెలుస్తోంది. అందులో ఒక సినిమా తెలుగు కాగా మరోటి బాలీవుడ్ ప్రాజెక్టని, స్టార్ డైరెక్టర్లు ఈ సినిమాలకు దర్శకత్వం వహించనున్నారని అంటున్నారు. అయితే సమంత ఈ రెండు సినిమాలు ఫైనల్ అయ్యే లోపు తన పర్ఫ్యూమ్ బిజినెస్ తో అందరినీ ఎట్రాక్ట్ చేసేలా కనిపిస్తున్నారు.

Edited, Published & Owned by KACHAM SATYANARAYANA. Printed at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS, #3-63, THANEDHARPALLE, GHANPUR STATION MANDAL, THANEDHARPALLE, WARANGAL, TELANGANA - 506143. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | RNI No: TGTEL/25/A1676, Email: vishwambhara.daily@gmail.com